


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 231 | బుధవారం 26 - 08 -2026 | పేజీలు : 12 | వెల-3


## బీసీలపై కక్ష సాధింపు వైసీపీదే.. మాది కాదు: మంత్రి అచ్చెన్నాయుడు



## ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం..

2లో

ఆంధ్రప్రదేశ్ నూతన లోకాయుక్తగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మల్లిఖార్జునరావు
విజయవాడలో ఆయనతో ప్రమాణం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు
పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరు



ఆంధ్రప్రదేశ్ నూతన లోకాయుక్తగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై, నూతన లోకాయుక్తగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మల్లిఖార్జునరావుకు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. ప్రమాణ స్వీకారం ముగిసిన అనంతరం జస్టిస్ మల్లిఖార్జునరావు, ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్ కాసేపు ముచ్చటించారు. పరిపాలనలో పారదర్శకత, అవినీతి నిర్మూలనకు లోకాయుక్త వ్యవస్థ ప్రాధాన్యాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు. అనంతరం లోక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన అల్పాహార విందులో గవర్నర్, ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు, న్యాయశాఖకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. జస్టిస్ మల్లిఖార్జునరావు నియామకంతో రాష్ట్రంలో పరిపాలన మరింత జవాబుదారీగా మారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.



## ఐపిఎస్ అధికారిపై క్రమశిక్షణ చర్యలు

విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై విచారణ

సస్పెన్షన్‌లో ఉన్న ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్‌పై క్రమశిక్షణ చర్యలకు ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో ఆయన అగ్నిమాపకశాఖ, సీఐడీ విభాగాల్లో విధులు నిర్వర్తించారు. సర్వీసు నిబంధనలు, క్రమశిక్షణ ఉల్లంఘనలపై ప్రభుత్వం రాతపూర్వక వివరణ కోరగా సంజయ్ ఇవ్వలేదు. దీంతో ఆయనపై సాధారణ విచారణ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2లో

## బిసిలపై జగన్‌ది కపట ప్రేమ

అవసరం కోసం వాడుకుని వదిసేసే రకం : యనమల

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలను ఆయన మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం యనమల ఓ ప్రకటన విడుదల చేశారు. 2లో

## ప్రధాని మోదీకి రాహుల్, ఖర్గే లేఖ.. కులగణనపై కీలక సూచన

2లో

కులగణన విధానంపై ఖర్గే, రాహుల్ అభ్యంతరం
ప్రధాని మోదీకి ఇద్దరూ సంయుక్తంగా లేఖ
ఓపెన్ ఎండెడ్ విధానంతో కులాల వివరాలు తప్పుగా నమోదయ్యే ప్రమాదం
కులాల పేర్లతో డ్రాప్‌డౌన్ జాబితా రూపొందించాలని డిమాండ్
తెలంగాణ, బిహార్ సర్వేల తరహాలో జాబితా రూపొందించాలని సూచన

కులగణనలో వివరాల సేకరణ విధానంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు.



# 30 ఏళ్ల సంకల్పం సాకారం..

## ఆగస్టు 31న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం..

ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

30 ఏళ్ల క్రితం తాను శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు వెల్లడి

నల్లమల సాగర్‌లోకి 10.7 టీఎంసీల నీటిని విడుదల చేయనున్న ప్రభుత్వం

పశ్చిమ ప్రకాశం ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ

వెలిగొండ జలాలతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు వస్తాయని ధీమా 2లో



ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 31వ తేదీన ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 1996లో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తానే శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును, మళ్లీ తన చేతుల మీదుగానే ప్రారంభించడంపై ఆయన ఎక్స్ వేదికగా భావోద్వేగంతో స్పందించారు. 'వెలిగొండ జలసిరులు అభివృద్ధికి రెక్కలు' అంటూ ఆయన తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ చారిత్రక ఘట్టానికి మార్కాపురం జిల్లా

## కన్నతల్లి పేరుతో మొక్కలు నాటాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు.



బాబా నగర్ సమీపంలో చెట్లు నరికి వేతపై సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్ కు వినతిపత్రం.
పర్యావరణ,పరిరక్షణ నేరం కింద కఠినచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి.
ఓ ప్రవేటు పాఠశాల స్వలాభం కోసం నరికేసిన చెట్లు. 2లో
జిల్లా అధికారులకు వినతి పత్రాలు.

**నంద్యాల బ్యూరో. ఆగస్ట్ 25 . (నంది పత్రిక ):** దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరు కన్నతల్లి పేరుమీద మొక్కలు నాటాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిస్తుంటే ఓ పాఠశాల యాజమాన్యం స్వలాభం కోసం వందల చెట్లు నరికివేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని నంద్యాల

# సత్రంలో సూసైడ్

## శ్రీశైలంలో ఐదుగురి ఆత్మహత్య

శ్రీశైలంలోని వడ్డెర సత్రంలో విషాదం
శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన కుటుంబం ఆత్మహత్య 2లో
మృతదేహాలు పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలింపు






# రాయలసీమకు సుజ్లాన్ భరోసా..

## రూ.10 వేల కోట్ల ప్రాజెక్టుకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన

రాయదుర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన 2లో

రూ.10,000 కోట్ల పెట్టుబడితో 1,325 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం

ప్రాజెక్టు ద్వారా 4,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు

మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా కొత్త బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ప్రారంభం

అనంత, ఉరవకొండ, కల్యాణదుర్గం నియోజకవర్గాల్లో ప్రాజెక్టుల ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన రంగం కొత్త ఊపు అందుకుంది. పవన విద్యుత్ రంగంలో రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి తరలివచ్చింది. అనంతపురం జిల్లా, రాయదుర్గం నియోజకవర్గంలో ప్రఖ్యాత సుజ్లాన్ సంస్థ రూ.10,000 కోట్ల భారీ పెట్టుబడితో నెలకొల్పనున్న విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

## స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే వైసీపీదే విజయం

స్థానిక ఎన్నికలు కేవలం గెలుపోటములకు మాత్రమే సంబంధించినవి కావన్న జగన్
క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన సమయమని వ్యాఖ్య
కుటుంబ సభ్యులను బరిలోకి దించేందుకు వెనుకాడవద్దని పిలుపు
పోటీలు లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని హెచ్చరిక
పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వ్యాఖ్య 2లో



స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని వైసీపీ అధినేత జగన్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్యనేతలతో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, రాబోయే స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

# బిసిలపై జగన్‌ది కపట ప్రేమ

జగన్ విధానం రెండు రకాలుగా ఉంటుందని అన్నారు. ఒకటి, బలహీన వర్గాలను ముఖ్యంగా బీసీలను బలిపశువులను చేయడం, రెండవది, మద్యం కుంభకోణం వంటి అవినీతి వ్యవహారాల నుంచి తనను తాను రక్షించుకోవడానికి తన పార్టీలోని బీసీ నాయకులను నేర లేదా అవినీతి కేసుల్లో ఇరికించడమని యనమల ఆరోపించారు. బలహీన వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా సాధికారత సాధించాలని జగన్, వైసీపీ ఎప్పుడూ కోరుకోలేదని చెప్పారు. బలహీన వర్గాల సమస్యలను పరిష్కరించడంలో వారికి టీడీపీ మాత్రమే అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలే టీడీపీకి వెన్నుముకగా నిలిచారని యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు.

# ప్రధాని మోదీకి రాహుల్, ఖర్గే లేఖ..

ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి ఇద్దరూ సంయుక్తంగా లేఖ రాశారు. ప్రస్తుతం ప్రతిపాదించిన 'ఓపెన్ ఎండెడ్' విధానాన్ని మార్చి.. కులాల పేర్లతో కూడిన డ్రాప్‌డౌన్ జాబితాను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.ప్రస్తుత విధానంలో వ్యక్తులు తమ కులం పేరును ఎలా చెబితే అలా నమోదు చేస్తారని ఖర్గే, రాహుల్ పేర్కొన్నారు. ఒకే కులానికి ప్రాంతాలను బట్టి వేర్వేరు పేర్లు, ఉపకులాలు, భాషా రూపాలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఒకే కులానికి చెందినవారి వివరాలు వేర్వేరు పేర్లతో నమోదైతే.. ఆ కులం వేలాది ఎంట్రీలుగా విడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇలా జరిగితే కులాల జనాభాపై కచ్చితమైన సమాచారం లభించదని తెలిపారు. ఫలితంగా వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, ఇతర అణగారిన వర్గాల స్థితిగతులపై సరైన అంచనా సాధ్యం కాదన్నారు. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలపై దీని ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.ముఖ్యంగా దేశంలో ఓబీసీల వాస్తవ జనాభా ఎంత అన్నది కూడా తేలకపోవచ్చని కాంగ్రెస్ నేతలు అన్నారు. కులగణనలో 'బ్యాక్‌వర్డ్ క్లాస్' అనే పదం చేర్చలేదని లేఖలో ప్రస్తావించారు.కులాల పేర్లతో డ్రాప్‌డౌన్ జాబితా రూపొందించాలని వారు సూచించారు. ఎస్సీ, ఎస్టీల గణనలో ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల ప్రభుత్వ జాబితాలు, ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వివరాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించవచ్చన్నారు. తెలంగాణ, బీహార్ కుల సర్వేల్లోనూ ఇదే విధానాన్ని అనుసరించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ప్రశ్నావళిని రద్దు చేసి.. రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదింపులు జరిపిన తర్వాత కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని ఖర్గే, రాహుల్ కోరారు.

# బీసీలపై కక్ష సాధింపు వైసీపీదే.. మాది కాదు: మంత్రి అచ్చెన్నాయుడు

ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీల ఆత్మగౌరవ పరిరక్షకుడని, ఆయన నాయకత్వంలోనే బీసీలకు నిజమైన రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారత లభించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలకు సంబంధించిన కేసుల్లో చట్ట ప్రకారం దర్యాప్తు సంస్థలు చర్యలు తీసుకుంటుంటే, వాటిని బీసీలపై కక్ష సాధింపుగా చిత్రీకరించే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**అవినీతి కేసులను బీసీలకు ఆపాదించొద్దు** గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని అచ్చెన్నాయుడు అన్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేయలేదని, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆధారాలతో చర్యలు తీసుకుందని గుర్తుచేశారు. కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి నిధులు చేరినట్లు తేలడంతో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే, దానిని బీసీలపై కక్షగా ఎలా చెబుతారని ప్రశ్నించారు. అదేవిధంగా, మద్యం కేసుల్లో దర్యాప్తు ఎదుర్కొంటున్న జోగి రమేశ్ అరెస్టును కూడా చంద్రబాబు, లోకేశ్‌కు ఆపాదించడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదేనని విమర్శించారు.

**గత ప్రభుత్వంలో బీసీలపై దమనకాండ కాదా?** 2019–24 మధ్యకాలంలో వైసీపీ ప్రభుత్వం బలహీన వర్గాలపై సాగించిన దమనకాండను ఆ పార్టీ నేతలు గుర్తు చేసుకోవాలని అచ్చెన్నాయుడు హితవు పలికారు. "నేను బీసీని కాదా? కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు బీసీలు కారా? వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించినందుకే మాపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారు. ఒక్క పైసా అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు చూపలేకపోయినా నన్ను 80 రోజులు జైలులో పెట్టారు. అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాద్ ఆదేశాలతో నాపై హత్యాయత్నం కేసు పెట్టించారు. కొల్లు రవీంద్రపై హత్య కేసు, అయ్యన్నపాత్రుడిపై అత్యాచారం కేసు, యనమల రామకృష్ణుడుపై అట్రాసిటీ కేసులు పెట్టినప్పుడు బీసీలపై కక్ష గుర్తుకు రాలేదా?" అని అచ్చెన్నాయుడు నిలదీశారు.

**రిజర్వేషన్లు తగ్గించి బీసీలకు ద్రోహం చేసింది వైసీపీ** స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, చంద్రబాబు దానిని 34 శాతానికి పెంచి బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించారని అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. అయితే, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి కుదించిందని, దీనివల్ల బీసీలు సుమారు 16 వేల రాజకీయ పదవులను కోల్పోయారని ఆరోపించారు. "హైకోర్టు తీర్పు వ్యతిరేకంగా వస్తే, సుప్రీంకోర్టుకు వెళ్లకుండా బీసీలకు అన్యాయం చేసింది మీరు కాదా?

# రాయలసీమకు సుజ్లాన్ భరోసా..

రాయదుర్గం నియోజకవర్గంలోని కనేకల్లు మండలం, హులికెర గ్రామం వద్ద ఈ భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. మొత్తం 1,325 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న ఈ పవన విద్యుత్ ప్రాజెక్టులను రాయదుర్గం, ఉరవకొండ, కల్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, సుజ్లాన్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎస్144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్'ను కూడా మంత్రి లోకేశ్ అధికారికంగా ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ప్రాజెక్టుకు సంబంధించిన ఆడియో విజువల్ (ఏవీ) ప్రదర్శనను వీక్షించారు. అంతకుముందు బళ్లారి సమీపంలోని హలకుంది గ్రామంలో ఉన్న సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును మంత్రి సందర్శించి, అక్కడి విండ్ టర్బైన్‌పై తన సంతకం చేశారు.ఈ సందర్భంగా సుజ్లాన్ ప్రతినిధులు ప్రాజెక్టు విశేషాలను మంత్రికి వివరించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో 1,700 మెగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యంతో అతిపెద్ద విండ్ భాగస్వామిగా ఉన్న సుజ్లాన్, తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. 2030 నాటికి రాష్ట్రంలో అదనంగా మరో 5,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను స్థాపించడమే లక్ష్యంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. పవన విద్యుత్ ఉత్పత్తిలో ఏపీని కీలక కేంద్రంగా మార్చేందుకు ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కీలక కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జి. లక్ష్మీనారాయణ, స్థానిక ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు (రాయదుర్గం), అమిలినేని సురేంద్రబాబు (కల్యాణదుర్గం), దగ్గుపాటి వెంకట ప్రసాద్ (అనంతపురం అర్బన్) పాల్గొన్నారు. సుజ్లాన్ గ్రూప్ తరఫున కో–ఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి, సీఈవో అజయ్ కపూర్, అడ్వైజర్ వి.బి. రావు, ఇతర భాగస్వామ్య సంస్థలైన టాటా పవర్ ఎండీ సంజయ్ బంగా, టోరెంట్ పవర్ డైరెక్టర్ జిగీష్ మెహతా, వారీ ఎనర్జీస్ సీఎండీ హితేష్ దోషి, ఎన్ఆర్ఈడీసీఏపీ లిమిటెడ్ వీసీ, ఎండీ ఎమ్. కమలాకర బాబు, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

# సత్రంలో సూసైడ్

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన తీవ్ర కలకలం రేపింది. శ్రీశైలంలోని వడ్డెర సత్రంలో ఈ విషాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి గ్రామానికి చెందిన సుధాకర్, ఆదిలక్ష్మి, మల్లేశ్వరి, శ్రీదేవి, మణికంఠ అనే ఐదుగురు కుటుంబ సభ్యులు ఈ నెల 20న శ్రీశైలానికి వచ్చి వడ్డెర సత్రంలో ఒక గదిని అద్దెకు తీసుకున్నారు. గదిలోకి వెళ్లిన తర్వాత వారు తలుపులు వేసుకుని బయటకు రాలేదు. గత మూడు రోజులుగా గది నుంచి ఎవరూ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన సత్రం సిబ్బంది వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని గది తలుపులు తెరిచి చూడగా... ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఆత్మహత్య చేసుకుని మృతి చెంది కనిపించారు. పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పవిత్రమైన శ్రావణమాసంలో శ్రీశైల పుణ్యక్షేత్రంలో ఇలాంటి విషాదం జరగడం స్థానికులను, భక్తులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

# స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే వైసీపీదే విజయం

ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కావని... క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన కీలక సమయమని జగన్ పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చూశామన్న ఆయన.. ఈసారి ప్రతి స్థానంలోనూ సమర్థులైన, బలమైన అభ్యర్థులను పోటీకి దింపాలని సూచించారు. అవసరమైతే నాయకులు తమ కుటుంబ సభ్యులను సైతం బరిలోకి దించేందుకు వెనకాడకూడదని పిలుపునిచ్చారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని... ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అక్కడి కో–ఆర్డినేటర్లు భవిష్యత్తులో అసెంబ్లీ అభ్యర్థులుగా కొనసాగలేరని హెచ్చరించారు. పార్టీ కేడర్ బలోపేతం కోసం 14 నుంచి 15 లక్షల క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయని... సెప్టెంబరు 5 నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి వీటిని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 'వెన్నుపోటు పార్టీ వెన్నుపోటు పాలన' అనే నినాదంతో గ్రామ స్థాయిలో వైసీపీ – కూటమి పాలన మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలను రక్షించుకోవడానికి నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్, మీడియా సెల్స్‌ను బలోపేతం చేయాలని... అవసరమైతే కేసులు హైకోర్టు వరకు తీసుకెళ్లేలా సమన్వయ వ్యవస్థ ఉండాలని తెలిపారు. అలాగే సోషల్ మీడియాను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని, 'జగన్ 2.0 సూపర్ యాప్', యూట్యూబ్, ఎక్స్ వంటి వేదికల ద్వారా నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతూ, రాజకీయ ఒత్తిళ్లతో చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారుల పేర్లను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి, భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాయకులు తమ ఈగోలను పక్కనపెట్టి, రాబోయే 60–70 రోజులు నియోజకవర్గాల్లోనే ఉంటూ స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కన్నతల్లి పేరుతో మొక్కలు నాటాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు.






జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు పేర్కొన్నారు.సోమవారం నిర్వహించే పి.జీ.అర్.ఎస్ లో భారతీయ జనతా పార్టీ,జనతా వారధి తరుపున,జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆదేశాల మేరకు నంద్యాల బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కశెట్టి చంద్రశేఖర్ జిల్లా లోని పలువురు అధికారులకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ప్రజలందరికీ ఒక మొక్క నాటండి,పర్యావరణాన్ని రక్షించండి అన్న ఒక్క పిలుపుతో లక్షల మొక్కలు నాటారని పేర్కొన్నారు.భావితరాలను దృష్టిలో పెట్టుకొని మొక్కలు నాటుతుంటే నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలం బాబా నగర్ సమీపంలో ఓ పాఠశాలకు చెందిన యాజమాన్యం స్వలాభం కోసం రోడ్డుకు ఇరువైపుల ఉన్న భారీ చెట్లను తొలగించిన విషయం పత్రికల్లో,సోషల్ మీడియా లో వచ్చిన విషయం తెలిసిందే అన్నారు..జిల్లాలో 450 చెట్లు గొడ్డలి వేటుకు బలైన అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు.ఈ నేపధ్యంలోనే గోస్పాడు మండలం బాబా నగర్ సమీపంలో ఓ ప్రముఖ విద్యా సంస్థ తమ సంస్థ వ్యక్తిగత లాభాపేక్ష కోసం రోడ్డు పై ఉన్న భారీ చెట్లను నరికి వేయడంపై చర్య తీసుకోవాలని బిజెపి జనతా వారధి లో భాగంగా జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ,ఆర్డీఓ, డీఎస్పీ, తహశీల్దార్,సర్కిల్ ఇన్స్పెక్టర్ లకు వినతి పత్రాలు అందించామన్నారు.బాబా నగర్ సమీపంలో దాదాపు 450 చెట్లు నరికి వేయడంపై ఆ పాఠశాల పాత్ర ఉందా,లేదా అనే విషయాన్ని సమగ్ర విచారణ చేసి పర్యావరణ,పరిరక్షణ నేరం కింద కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.బాధ్యులపై నిజా, నిజాలు తేల్చి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సెంట్రల్,స్టేట్ అధికారులతో పాటు ట్రిబ్యునల్ దృష్టికి తీసుకొని వెళతానని అన్నారు.జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేయని పక్షంలో ఆటశాఖ మంత్రి,ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్, ఎన్విరాల్ మెంట్,పొల్యూషన్ ,రహదారులు,భవనాల శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో పాటు కేంద్ర,రాష్ట్ర బిజెపి పెద్దల దృష్టికి తీసుకొని వెళతానన్నారు.పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని,ఇంతటి దారుణం మరోసారి జరగకుండా ఉండేందుకు జాతీయ స్థాయి నేతలు అందరి దృష్టికి తీసుకొని వెళతానన్నారు.చెట్లను నరికివేయాలంటే భయపడే విధంగా చర్యలు ఉండే విధంగా చేస్తానని అన్నారు.జిల్లా అధికారులు గత రెండు నెలలుగా చెట్లను నరికి వేస్తుంటే ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.చెట్లు నరికివేస్తున్నా సైలెంట్ గా ఉంది విధులు నిర్వహించని పెద్ద స్థాయి నుంచి చిన్న స్థాయి వరకు అధికారులపై పర్యావరణ,పరిరక్షణ నేరం కింద కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




# 30 ఏళ్ల సంకల్పం సాకారం..

వేదిక కానుందని, ఈ సందర్భంగా నల్లమల సాగర్‌లోకి 10.7 టీఎంసీల కృష్ణా జలాలను విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎన్నో అవాంతరాలు, సవాళ్లను అధిగమించి భగీరథ ప్రయత్నంతో వెలిగొండ ఫేజ్–1ను పూర్తి చేసి కరవు నేలకు కృష్ణమ్మ జలాలను అందిస్తున్నామని తెలిపారు. మూడు దశాబ్దాల క్రితం తాను తీసుకున్న సంకల్పం నేడు సాకారమైందని, తీవ్ర కరవు ప్రాంతమైన ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల జీవితాల్లో ఇది గొప్ప మార్పు తీసుకువస్తుందని అన్నారు. ఈ మేరకు 1996 మార్చి 5న తాను శంకుస్థాపన చేసిన నాటి ఫొటోను ప్రస్తుత ట్వీట్‌కు జత చేశారు. ఈ ప్రాజెక్టుతో తరతరాలుగా కరవుతో పోరాడుతున్న ప్రజలకు శాశ్వత ఉపశమనం కలుగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఫేజ్–1తో 1.19 లక్షల ఎకరాలకు, ఫేజ్–2 పూర్తయితే మరో 3.28 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. కేవలం సాగునీరే కాకుండా, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించి, పశ్చిమ ప్రకాశం ప్రాంతాన్ని పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. "దుర్భిక్ష ప్రాంతమైన మార్కాపురానికి వెలిగొండ ఒక వెలుగుల దండ అవుతుంది" అని ఆయన అభివర్ణించారు. ప్రాజెక్టుతో పాటు ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు రూ.1 లక్ష కోట్లతో పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. బెంగళూరు–అమరావతి హైవే, రామాయపట్నం పోర్టులతో వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుస్తామని చెప్పారు. "ప్రతి రైతు పొలానికి నీరు, ప్రతి యువకుడికి ఉపాధి, ప్రతి కుటుంబానికి భరోసా... ఇదే 'సీబీఎన్ అనే నేను' సంకల్పం" అని చంద్రబాబు తన ట్వీట్‌లో స్పష్టం చేశారు. ప్రతి పౌరుడూ 'నేను...' అనే స్ఫూర్తితో పనిచేసి జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఐపిఎస్ అధికారిపై క్రమశిక్షణ చర్యలు

విచారణాధికారిగా హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్‌ను సీఎస్ సాయిప్రసాద్ నియమించారు. నిర్ణీత గడువులోపు విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గతేడాది జనవరిలో సంజయ్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. తన పరిధిలో లేకపోయినా రూ.1.20కోట్ల వరకు చెల్లింపులు చేసినట్లు ఆయనపై అభియోగాలు ఉన్నాయి. ఈ క్రమంలో 8 అంశాలను ప్రస్తావిస్తూ వివరణ ఇవ్వాలని ప్రభుత్వం సంజయ్‌ను ఆదేశించింది. ఆయన స్పందించకపోవడంతో విచారణ నిర్వహించాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

# ఇరాన్‌పై ట్రంప్ ఆర్థిక యుద్ధం !

అమెరికా, ఇరాన్ యుద్ధంలో కొత్త అధ్యయం మొదలయ్యింది. ఇరాన్‌ను ఆయుధాలతో దెబ్బతీయడం కుదరని పని అని అమెరికాకు తెలిసొచ్చింది. దీంతో ఇక ఆర్థిక యుద్ధం మొదలు పెట్టింది. దీంట్లోనూ ప్రపంచ దేశాలను లాగే యత్నం చేస్తోంది. ఇరాన్‌తో సంబంధాలు పెట్టుకునే దేశాలపైనా ఆంక్షలు కొనసాగిస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయుధంతో పోరాటమైనా, ఆర్థిక పోరాటమైనా తన పంతమే నెగ్గాలన్నది ట్రంప్ వాదనగా ఉంది. నేను చెప్పినట్లు వినాలన్న ధోరణితో అమెరికా ఇప్పుడు ప్రపంచ దేశాలకు హెచ్చరికలు చేస్తోంది. ఈ క్రమంలో ఇరాన్‌పై మొన్నటి వరకు భౌతిక దాడులకు పాల్పడిన అమెరికా ఇప్పుడు రూటు మార్చింది. సరికొత్త ఆంక్షల పేరుతో టెహ్రాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని యోచిస్తున్నది. ఇందులో భాగంగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెం ఇరాన్‌పై చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ఆర్థిక ఆంక్షలను ప్రకటించారు. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌క్యాస్ట్' పేరుతో ఈ కొత్త ఆంక్షల ప్యాకేజీని ప్రకటించారు. కాగా, ఇరాన్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా అన్ని వర్గాలపై ప్రభావం చూపుతున్నది. పెరిగిన చమురు ధరలు జీవన వ్యయంపై ఆందోళనలను పెంచాయి. పెట్రోల్,డీజిల్ ధరలు ఏడాది క్రితం కంటే చాలా ఎక్కువగా ఉండంతో అమెరికాతో పాటు అన్ని దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. మరో వైపు ఇరాన్‌పై ఆంక్షలను ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు స్వాగతించారు. ఇరాన్ ఆర్థిక మూలాలను పూర్తిగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. టెహ్రాన్‌పై ఇది ఒక 'ఆర్థిక డి–డే' లాంటిదని హెచ్చరించారు. డిజిటల్ ఆస్తులు, టెక్నాలజీ, బంగారం, విమానయానం, నౌకా రవాణా వంటి కీలక రంగాలను ఈ ఆంక్షల పరిధిలోకి తీసుకొచ్చారు. ఇరాన్‌తో వ్యాపారం కొనసాగించే ఇతర దేశాలు, సంస్థలపై కూడా ద్వితీయ స్థాయి ఆంక్షలు విధించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీంతో పాటు ఇరాన్ చమురు ఆదాయం, ఆయుధాల సేకరణ, సైబర్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న 60కి పైగా వ్యక్తులు, కంపెనీలు, నౌకలపై కూడా ఆంక్షలు విధించారు. ఇరాన్‌తో ఆర్థిక పోరులో ఇది చివరి అంకమని అమెరికా ప్రకటించింది. ఇరాన్‌తో సంబంధాలు తెంచుకోవాలని ప్రపంచ దేశాల నాయకులను కోరారు. మీరు మా వైపు ఉంటారా లేక మాకు వ్యతిరేకంగా ఉంటారా అని అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటికే ఇరాన్‌కు మద్దతు ఇస్తున్న సుమారు 60 సంస్థలు, విదేశీ నౌకలపై అమెరికా నిఘా పెట్టింది. సహకరించే ఇతర దేశాలకూ ఆంక్షల భయం ఉంటుందని తెలిపారు. ఇరాన్‌తో ఆర్థికంగా భాగస్వామ్యం వహించే ఏ దేశమైనా ఏకాకిగా మిగిలిపోతుందని బెసెంట్ తెలిపారు. ఇరాన్‌పై కొన్నినెలలుగా దాడులు చేసిన అమెరికా ఇప్పుడు ఆర్థికంగా వెన్నువిరిచే ప్రయత్నాలు మొదలుపెట్టింది. అంతర్జాతీయంగా ఇరాన్‌కున్న ఆర్థిక సంబంధాలను తెంచేయడమే లక్ష్యంగా అగ్రరాజ్యం కొత్త ఆంక్షలను ప్రకటించింది. టెహ్రాన్‌తో సంబంధాలు కొనసాగిస్తూ, నగదు అక్రమ చలామణిలో దానికి తోడ్పడే దేశాలను డాలరు వ్యవస్థ నుంచి దూరం చేస్తామని యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ప్రకటించారు. దీనికి ఇరాన్ దీటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కోవడానికి తమ వద్ద రెండేళ్ల ప్రణాళిక ఉందని, ప్రతీకార చర్యలు తప్పవని బదులిచ్చింది. ఇరాన్ పై అమెరికా ఆంక్షలు విధించడం కొత్తేం కాదు. ఇరాన్‌కు ప్రపంచంతో ఉన్న ఆర్థిక జీవనాధారాన్ని తెగ్గొట్టడమే తాజా ఆంక్షల లక్ష్యమని బెసెంట్ ప్రకటించారు. అయితే యూఎస్ నుంచి ఎదురయ్యే ఒత్తిడిని తమ వాణిజ్య భాగస్వాములు గట్టిగా వ్యతిరేకిస్తారని టెహ్రాన్ విశ్వాసం వ్యక్తంచేసింది. ఈ మేరకు ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ గాలిబఫ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఇతర దేశాలతో ఇరాన్‌కున్న సంబంధాలను తెగ్గొట్టే స్థితిలో అమెరికా లేదన్నారు. అమెరికన్ల ప్రగల్భాలను ఎవరూ నమ్మరు. అమెరికా ఆంక్షలప్రకటనను పరిగణనలోకి తీసుకోబోమని మా వాణిజ్య భాగస్వాములు ఇప్పటికే మాకు సందేశాలు పంపారని పేర్కొన్నారు.యూఎస్ ప్రకటనపై ఇటు ఇరాన్ ప్రభుత్వం కూడా ఘాటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కొవడానికి మా వద్ద రెండేండ్ల ప్రణాళిక ఉందని, ప్రతీకార దాడులు తప్పవని బదులిచ్చింది. ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదనీజాదేహ్ మాట్లాడుతూ.. అమెరికా ఆంక్షలను ఎదుర్కొనేందుకు మేం సర్వసన్నద్ధంగా ఉన్నాం. శత్రువులు మాపై ఆర్థిక ఉగ్రవాద దాడికి పాల్పడాలని చూస్తున్నారు. కానీ, మా వద్ద కూడా తగిన సాధనాలు ఉన్నాయి. ఇకపై మాది కేవలం రక్షణెళి కాదు, శత్రువులు మా దాడి కోసం ఎదురుచూడాలని హెచ్చరించారు. అమెరికా ఆంక్షలను చైనా, రష్యా అంగీకరించలేదని, ఇతర దేశాలు కూడా ప్రతిఘటిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహసెన్ రెజాయ్ మరింత ఘాటుగా స్పందించారు. అమెరికాకు సహకరించే ఏ దేశమైనా 'భూకంపం లాంటి' ప్రతీకారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# జోగి రమేష్ బీసీ కార్డు వాడడానికి సిగ్గుండాలి

## జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్

**కర్నూల్ సిటీ నంది పత్రిక** బీసీల గురించి మాట్లాడే అర్హత మాజీ మంత్రి వైసీపీ నాయకులు జోగి రమేష్ కు లేదని కర్నూలు జిల్లా బీసీ సంఘుల నాయకులు అన్నారు. కర్నూలు బీసీ భవన్ లో బీపీ మండల్ జయంతి సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్, బీసీ సంఘుల నాయకులు బీపీ మండల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ బీపీ మండల్ ఆశయాలను కొనసాగిస్తామన్నారు. వైసీపీ హాయంలో బీసీలకు అన్యాయం జరిగితే మాజీమంత్రి జోగి రమేష్ స్పందించలేదని ఇప్పుడు తన కుటుంబ వ్యవహారాన్ని బీసీలకు అన్యాయం జరిగినట్లు మాట్లాడడం సరికాదన్నారు. ఒక గుండా మాదిరిగా పార్టీ కార్యాలయాలపై దాడికి పాల్పడి, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన జోగి రమేష్ ఇప్పుడు బీసీ ల గురించి మాట్లాడితే ఎవరు నమ్మరన్నారు. గత ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను పదిశాతం తగ్గించి 16వేల 4 వందల పదవులు తగ్గిస్తే అప్పుడు జోగి రమేష్ కు బీసీలు గుర్తుకు రాలేదా అని నాగేశ్వరరావు యాదవ్ ప్రశ్నించారు. బీసీలను కిరాతకంగా హత్య చేస్తే మాట్లాడని జోగి రమేష్ తన కుటుంబంలో జరిగే వివాదాలను బీసీలకు అన్యాయం జరిగిందని కూటమి ప్రభుత్వం పై బురదజల్లే విధంగా ప్రవర్తించడాన్ని బీసీలు నమ్మరన్నారు. జోగి రమేష్ చేసిన అవినీతి వల్ల జైలుకు వెళితే దాన్ని బీసీలకు అన్యాయం జరిగిందని చెప్పడానికి సిగ్గుండాలన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో బీసీలకు రక్షణ చట్టంతోపాటు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లతో నిర్వహిస్తున్నారని నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. ఈకార్యక్రమంలో నాగేశ్వరరావు యాదవ్, క్రిష్ణోజి, విజయ్ కుమార్,కుమ్మరి రామకృష్ణ, రాజు యాదవ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# నంద్యాల 1వ వార్డులో నిలిచిపోయిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్



## రూ. 90 లక్షల నిధులతో మిగిలిన పనుల పునరుద్ధరణ త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తాగునీరు

**నంద్యాల సిటీ బ్యూరో ఆగష్టు 25 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని 1వ వార్డు పరిధిలో గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో 80 శాతం పూర్తయి, మిగిలిన 20 శాతం పనులు నిలిచిపోయిన తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంక్ (వాటర్ ట్యాంక్) నిర్మాణ పనులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఆయన నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో 80% పనులు పూర్తయి 20% పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని వాటిని గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఐదేళ్ల హయాంలో పూర్తి చేయలేక పోయిందని అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వార్డు ప్రజల తాగునీటి ఇబ్బందులను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిలిచిపోయిన వాటర్ ట్యాంక్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంకల్పించడం జరిగిందని . ఇందుకోసం డీపీఎస్ మరియు ఎల్ఆర్ఎస్ నిధుల నుంచి రూ. 90 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నిధులతో ట్యాంక్ స్లాబ్ పనులు, పైప్‌లైన్ల అనుసంధానం, పెయింటింగ్ పనులు మరియు అవసరమైన ఇతర మరమ్మతులు వేగవంతంగా పూర్తి చేసి, త్వరలోనే ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ నాణ్యతలో రాజీ పడకుండా, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, టిడిపి రాష్ట్ర యువనాయకులు ఎన్ఎండి ఫయాజ్, నంద్యాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సుమలత , నంద్యాల ఒకటో వార్డు టిడిపి నాయకులు గురు ప్రసాద్, ప్రసాదు (బల్లి), మధు కుమార్, గుల్లి, సుంకయ్య, బాలమదిలేటి, పెద్ద స్వామి, రాజు, కాశమ్మ, ఆరంగుల శేఖర్, లోకేష్ , లెజెండ్ శీను, ఈశ్వరయ్య, వెంకట దాస్ మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, 1వ వార్డు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





# రాయలసీమ జోనల్ తైక్వాండో విజేతలకు అభినందన





## పతకాలు సాధించిన విజేతలను అభినందించిన డాక్టర్ రవి కృష్ణ

## తైక్వాండో కోచ్ లు సర్దార్, బాలకృష్ణ, షానవాజ్ శిక్షణలో విజయాలు సాధించిన క్రీడాకారులు

## భవిష్యత్తు లో మరిన్ని విజయాలకు నిరంతర సాధన అవసరం: డాక్టర్ రవి కృష్ణ

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 25 ( నంది పత్రిక )** ఉమ్మడి కర్నూలు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో గత శని, ఆదివారాలలో నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో, ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి చంద్రమౌళి పర్యవేక్షణలో నిర్వహించిన రాయలసీమ జోనల్ స్థాయి తైక్వాండో పోటీలలో విజయం సాధించిన నంద్యాల పట్టణ క్రీడాకా రులను మంగళవారం లయన్స్ క్లబ్ అంతర్జాతీయ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్, ఉమ్మడి కర్నూలు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ, లయన్స్ క్లబ్ జిల్లా పి.ఆర్.ఓ. సుధాకర్ రెడ్డి అభినందించారు. నంద్యాల పట్టణంలో సర్దార్, బాలకృష్ణ,షానవాజ్ మాస్టర్లు శిక్షణ ఇచ్చిన వివిధ పాఠశాలలు,కళాశాలలకు చెందిన తైక్వాండో క్రీడాకారులు పలువురు విజేతలుగా నిలిచారు.
సర్దార్,షానవాజ్ మాస్టర్లు శిక్షణ ఇచ్చిన క్రీడాకారులు 4 బంగారు పతకాలు,8 రజత పతకాలు,5 కాంస్య పతకాలు సాధించగా, బాలకృష్ణ మాస్టర్ శిక్షణ ఇచ్చిన క్రీడాకారులు 5 బంగారు పతకాలు,3 రజత పతకాలు,3 కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన మాస్టర్లు సర్దార్, బాలకృష్ణ, షానవాజ్ లకు డాక్టర్ రవి కృష్ణ అభినందనలు తెలిపారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ క్రీడలలో విజయం సాధించినవారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించడానికి క్రమశిక్షణ, అంకితభావంతో కూడిన నిరంతర సాధన మాత్రమే ఏకైక మార్గం అన్నారు.బాలికలకు తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ ఇప్పించడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి కృష్ణ, లయన్స్ క్లబ్ జిల్లా పి. ఆర్.ఓ. సుధాకర్ రెడ్డి, కోచ్ లు బాలకృష్ణ, షానవాజ్, క్రీడా కారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారులు: సఖియా, ఈశ్వర చారి, మేఘన,సారిక, నాగరామ చరణ్,ప్రణతి సాయి, నవనీత్, సుకుమార్ శామ్యూల్,మోక్షిత.

**రజత పతకాలు సాధించిన విజేతలు:** తనుజ, సహారా,మధురిక్ రెడ్డి, మధుసూదన్,మౌనీశ్వర్, సాక్షి,సౌమ్య, రాణి,ధార్మిక్ సాయి,సాయి వర్ధిని,భవ్య శ్రీ.

**కాంస్య పతకాలు సాధించిన విజేతలు:** హేమ సాయి,అఫ్రాన్,సమీరా, నిక్షిత్,అష్రాఫ్,ఆదిత్య, సుశాంక్, తమన్.

# ఆంధ్రప్రదేశ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షున్ని పరామర్శించిన బి కె ఎం యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్

**కర్నూలు సిటీ నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కొళాయిల రాముడు కళ్ళకు ఆపరేషన్ చేయించుకోవడం జరిగింది కళ్ళు మసకబారడం వల్ల తీవ్రంగా ఇబ్బంది పడుతున్న రాముడు ఇటీవలె తన కళ్ళకు ఆపరేషన్ చేయించుకోవడం జరిగింది ఈ విషయం తెలుసుకొన్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ వర్కురు గ్రామం లోని స్వగృహంలో విశ్రాంతి తీసుకొంటున్న కొళాయిల రాముడును ఆవుల శేఖర్ పరామర్శించారు. కంటి ఆపరేషన్ విషయాలను మరియు ఆయన ఆరోగ్యం విషయాలను అడిగి తెలుసుకున్నారు కంటి పట్ల నిర్లక్ష్యం తగదని ఆరోగ్యం విషయాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శేషుకుమార్, ఈశ్వరయ్య ఆచారి, రామాంజనేయులు, గొల్ల రంగడు,గోవిందు పెద్దయ్య, చేనేత కార్మిక సంఘం నాయకులు బాబురావు,సిపిఐ గ్రామ కార్యదర్శి మునిస్వామి లు వున్నారు.



# కడప ప్రజల ఆరోగ్య రక్షణ కోసం వీధి శుభ్రత - ఆరోగ్య భద్రత.



**నందిని ప్రతినిధి, ఆగస్ట్ 25, వైయస్సార్ కడప జిల్లా.** మన కడప- స్వచ్ఛ కడప రాష్ట్ర ప్రభుత్వ వైపు కడప ఎమ్మెల్యే ఆర్ మాధవరెడ్డి మరియు టిడిపి జోనల్ కోఆర్డినేటర్ ఆర్ శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు. 26వ డివిజన్ ఇంచార్జ్ చావలముడి శంకర్ ఆధ్వర్యంలో కడప 26వ డివిజన్ గరీక్ష వీధి మరియు మసీద్ సందు నందు బూత్ నెంబర్ 168 లో కాలవను పుడికి తీయించి క్లీన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, 26వ డివిజన్ నాయకులు మున్నంగి రత్నం, ప్రతాప్, చరణ్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు

# మహబూబ్ సాహెబ్ మృతికి రెడ్యం సోదరుల సంతాపం

## మంచి మనిషి మహబూబ్ సాహెబ్ మృతి బాధాకరం: రెడ్యం సోదరులు



**కడప నంది పత్రిక ప్రతినిధి ఆగష్టు 25** దువ్వూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత రాజుపాలెం మహబూబ్ షరీఫ్ తండ్రి మహబూబ్ సాహెబ్ (75) అనారోగ్యంతో మృతి చెందారు. గుడిపాడులోని ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత, కేసీ కెనాల్ ప్రాజెక్టు మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డిలు మంగళవారం ఉదయం మహబూబ్ సాహెబ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. మహబూబ్ సాహెబ్ మంచి మనిషిగా అందరితో సత్సంబంధాలు కలిగి ఉండేవారని, ఆయన మృతి బాధాకరమని రెడ్యం సోదరులు పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోనిబ్బరం కల్పించాలని అల్లాను ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

# అక్రమ మట్కా జూదంపై కడప తాలూకా పోలీసుల మెరుపు దాడి



**కడప నంది పత్రిక ప్రతినిధి ఆగష్టు 25** కడప నగరంలోని ఆచారి కాలనీ ఎల్లమ్మ దేవాలయం సమీపంలో అక్రమంగా మట్కా జూదం నిర్వహిస్తున్న ముగ్గురిని కడప తాలూకా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.93,360 నగదు, 3 మట్కా స్లిప్పులు, 3 బాల్‌పెన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. విశ్వసనీయ సమాచారం అందడంతో సోమవారం ఉదయం సబ్-ఇన్‌స్పెక్టర్ ఎం. మహమ్మద్ రఫీ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మట్కా నంబర్లు, నగదు సేకరిస్తున్నట్లు గుర్తించి లిషేక్ ఖాజా భాను ఏ భాను (33), కాశీ విక్రమాచారి (31), రాజంపల్లి శివ (34)లిలను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ మట్కా, జూదం, బెట్టింగ్ కార్యకలాపాలకు పాల్పడినా, వాటికి సహకరించినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# మంత్రి గొట్టిపాటి రవి ని మర్యాద పూర్వకంగా కలిసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను ఎంపీ బస్తిపాటి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు.. మంత్రాలయం మండల కేంద్రం లో జరిగే మంత్రుల ఓట్ రీచ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు కర్నూలు నగరానికి విచ్చేసిన మంత్రిని కలిసిన ఆయన శాలువాతో సత్కరించారు.. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు జిల్లాలోని విద్యుత్ శాఖ కు సంబంధించిన పలు అంశాల పై మంత్రి గొట్టిపాటితో చర్చించారు.

# రహదారులపై చెత్త వేస్తే జరిమానా

## నగర స్వచ్ఛతకు సహకరించని వారిపై ఉదాసీన వైఖరి తగదు

## వాణిజ్య దుకాణదారులకు కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరిక

**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు నగరంలోని రహదారులపై చెత్త వేసే వారిపై ఉదాసీన వైఖరి తగదని, నగర స్వచ్ఛతకు సహకరించని వాణిజ్య దుకాణదారులకు జరిమానా విధించాలని నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు పారిశుద్ధ్య పర్యవేక్షక యంత్రాంగానికి ఆదేశించారు. మంగళవారం ఎన్ఆర్ పేట, గాంధీనగర్, 5 రహదారుల కూడలి, రివర్‌వ్యూ కాలనీ, రాజ్ విహార్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.ఎన్ఆర్ పేటలో పలు దుకాణదారులు షాపుల ఎదుట డస్ట్ బిన్‌లు లేకపోవడం, రహదారులపైనే చెత్త వేయడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే అటువంటి వారిని గుర్తించి, హెచ్చరించాలని, పద్ధతి మార్చుకోకపోతే జరిమానా విధించి, ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి దుకాణాన్ని సీజ్ చేయాలని ఆదేశించారు.అదేవిధంగా రాజ్ విహార్ దర్గా ప్రాంతాన్ని సందర్శించి, బుధవారం జరగనున్న మిలాద్ ఉన్ నబి వేడుకలకు సంబంధించి పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



# నంద్యాల టౌన్ 1 వ వార్డులలో వైభవంగా 'ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్

### ప్రజల ముంగిటకే కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి హామీలను నెరవేరుస్తూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న సీఎం చంద్రబాబు



**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 25 ( నంది పత్రిక )** కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి అందుతున్నాయని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని 1 వ వార్డ్ లలో అరుంధతి నగర్ పరిసర ప్రాంతాలలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మంత్రి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి వార్డులోని ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి, కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు సాధించిన ప్రగతిని, అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేస్తూ, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలు, సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. యువత భవిష్యత్తు, పేదల సంక్షేమం, మహిళా సాధికారత, విద్య, ఉపాధి, మరియు మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. నంద్యాలలో చంద్రన్న సంక్షేమ పాలనపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నాయకత్వానికి నంద్యాల ప్రజలు పూర్తి మద్దతుగా నిలుస్తున్నారని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నంద్యాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సుమలత , నంద్యాల ఒకటో వార్డు టిడిపి నాయకులు గురు ప్రసాద్, ప్రసాదు (బల్లి), మధు కుమార్, గుల్లి, సుంకయ్య, బాలమదిలేటి, పెద్ద స్వామి, రాజు, కాశమ్మ, ఆరంగుల శేఖర్, లోకేష్ , లెజెండ్ శీను, ఈశ్వరయ్య మరియు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పారదర్శక ఓటరు జాబితాలకు సహకరించాలి

### ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే ఆధారాలతో రాతపూర్వకంగా తెలియజేయాలి
### అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు
### ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎలెక్టోరల్ అబ్జర్వర్ బి.లావణ్య



**కర్నూలు సిటీ నంది పత్రిక** పారదర్శక ఓటరు జాబితాల రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీలు, ఓటర్లు సహకరించాలని, ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలుంటే తగిన ఆధారాలతో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కర్నూలు జిల్లా ఎస్ఐఆర్ ఎలెక్టోరల్ అబ్జర్వర్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.లావణ్య సూచించారు. మంగళవారం నగరంలోని పాతబస్తీ కింగ్ మార్కెట్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 248వ పోలింగ్ బూత్‌లో నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్ డేను కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మృతులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, ఆచూకీ లేని వారు, డూప్లికేట్ ఓటర్లకు సంబంధించిన వివరాలను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు, వివరాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యంతరాలకు సంబంధించి తగిన ఆధారాలను జతచేసి రాతపూర్వకంగా సమర్పించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటరు జాబితాలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవడం ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితాలను ప్రజలకు అందుబాటులో ఉంచి, వాటిని పరిశీలించేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల నుంచి అందే క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత మేరకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు క్రియాశీలకంగా భాగస్వాములై ఓటరు జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందేందుకు సహకరించాలని కోరారు. ఈఆర్వో చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలోని వివరాలను ప్రతి ఓటరు పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే నిర్ణీత గడువులో సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా, అనర్హులైన పేర్లు తొలగించేలా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఆర్వోలు తహశీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, కార్యదర్శి నాగరాజు, బిఎల్వోలు, సూపర్వైజర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# 29న జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### కరపత్రం విడుదల చేసిన వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రామాంజనేయులు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** చేతి వృత్తి దారుల జీవితాల్లో మార్పు రావాలని డిమాండ్ చేస్తూ 29-0 8-26న ఆంధ్ర ప్రదేశ్ చేతి వృత్తి దారుల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ "కరపత్రం "విడుదల. 25-08-2026న కర్నూలు నగరంలో చంద్ర రాజేశ్వరరావు భవన్ నందు 12 సంవత్సరాల నరేంద్ర మోడీ పరిపాలనలో, రెండున్నర సంవత్సరాల చంద్రబాబు నాయుడు ప్రభుత్వాలు అనుసరిస్తున్న చేతి వృత్తి దారులకు వ్యతిరేకమైన విధానాల వల్ల చేతి వృత్తి దారుల జీవితాలు అత్యంత దుర్భరంగా మారిన నేపథ్యంలో చేతి వృత్తి దారుల జీవితాల్లో మార్పు రావాలని -మార్పు కావాలని కోరుతూ ఆగస్టు 29న చేతి వృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రవ్యాప్తంగా ధర్మా నాలలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, సమాఖ్య కర్నూలు జిల్లా కార్యదర్శి ఎం. కారన్న, ఎ ఐ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్ బాబు లతో కలిసి సమాఖ్య రాష్ట్ర సమితి ముద్రించిన కరపత్రమును విడుదల చేశారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు మాట్లాడుతూ తరతరాలుగా ఎంతో వృత్తి నైపుణ్యంతో సమాజానికి సేవలందిస్తున్న చేతి వృత్తి దారులు నేడు పాలకుల అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూలమైన విధానాల వల్ల సంప్రదాయంగా చేసుకుంటున్న చేతి వృత్తు లోకి డబ్బు ఉన్న కార్పొరేట్ వ్యాపారులు ప్రవేశించి వృత్తి దారులను, చేతువృత్తులను కబలించడంతో చేతి వృత్తి దారుల జీవితాలు అత్యంత దుర్భరమైన పరిస్థితుల్లోకి దిగజారా రాయనిచేతి వృత్తి దారులు నేడు అర్థాకలితో ఆకలి చావులతో జీవిస్తున్న పరిస్థితులపై కేంద్రంలో అధికారంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారుల కొనసాగుతున్న ఎన్డీఏ కోట ప్రభుత్వాలు డబల్ ఇంజన్ ప్రభుత్వాన్ని గొప్పలు చెప్పుకుంటూ చేతి వృత్తి దారులను మభ్యపెట్టి ఎన్నికల కు ఎన్నికల సందర్భంగా చేసిన 18 రకాల చేతి వృత్తి దారు లకు విశ్వకర్మ యోజన పథకం కింద ఆదుకుంటామని,మరో వైపు చంద్రబాబు సూపర్ సిక్స్ వాగ్దానాల కింద చేతివృత్తిదారులను ఆర్థికంగా సామాజికంగా ఆదుకొని వారి ఆత్మగౌరవంతో జీవించేందుకు తోడ్పడతామని చెప్పిన వాగ్దానాలన్నీ నేడు ఘోరంగా విఫలమయ్యాయి 30 రకాల పైగా ఉన్న చేతి వృత్తి దారులు రాష్ట్ర జనాభాలో మూడవ శాతం ఉన్నప్పటికీ జనాభా ప్రాతిపదిక పైన వృత్తి దారుల సంక్షేమం కోసం నిధులు కేటాయిం ఉంచడం లేదు అందుకే చేతి వృత్తి దారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా చేతి వృత్తి దారులకు రాష్ట్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, జనాభా ప్రాతిపదిక పైన ఉపప్రణాళికలు ఏర్పాటు చేసి నిధులు ఖర్చు చేయాలని ప్రతి చేతి వృత్తి దారు ని కి వయసుతో నిమిత్తం లేకుండా అయిదు లక్ష రూపాయలు 50% సబ్సిడీతో బ్యాంకు లింకేజీ లేకుండా సొంత పూచికతో కార్పొరేషన్ ద్వారా అందజేయాలని,50 సంవత్సరాలు దాటిన ప్రతి వృత్తి దారునికి 6000 సామాజిక పెన్షన్ వయసుతో నిమిత్తం లేకుండా ఒంటరి,వితంతు,వైద్య పెన్షన్ ఇవ్వాలని వికలాంగులకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని చేతి వృత్తి దారులు అందరికీ గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు చేతి వృత్తిదారుల వృత్తుల నిర్వహణకు అవసరమైన ముడిసరకు,పరపతి,భూమి, నీరు, రోడ్లు,కరెంటు మొదలైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని చేతివృత్తిదారులపై జరుగుతున్న కులవి వచ్చే దాడులను అత్యాచారాలను దౌర్జన్యాల ను కట్టడానికి రజకులపై జరిగే దాడులు అరికట్టేందుకు సామాజిక రక్షణ చట్టం చేయాలని చేనేత, రజక, మత్స్యకార,క్ష వుర,గీత,వడ్డెర మేదర,గొర్రెల మేకల పెంపకం దారులు,కుమ్మరి, పంచ వృత్తిదారులు స్వర్ణకారులు దూదేకుల,చర్మకారులు,తదితర వృత్తిదారులందరికీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు రెవెన్యూ డివిజన్ కేంద్రాలు మండల కేంద్రాల్లో పెద్ద సంఖ్యలో జరిగే ధర్నాలలో చేతి వృత్తి దారులు పాల్గొనడం ద్వారా చేతి వృత్తి దారుల జీవితాల్లో మార్పు తీసుకువచ్చేందుకు జరుగుతున్న ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కె.రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బి బి రాముడు,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు వెంకట రాముడు,సమాఖ్య నాయకులు కె. దేవేంద్ర, బిసన్న, మద్దిలేటి, రాజేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# పేద రోగులకు సీఎం చంద్రబాబు కొండంత భరోసా.

### 32 మందికి రూ. 30,46,059 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 25 ( నంది పత్రిక )** పేద రోగులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొండంత భరోసా ఇస్తున్నారని, తాను ఎంపీ గా సిఫారసు చేసిన వెంటనే బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నిధులు మంజూరు చేసి వారికి తమ ప్రభుత్వం అండగా ఉందన్న మనోధైర్యం సీఎం చంద్రబాబు కల్పిస్తున్నారని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. నంద్యాల బొమ్మలసత్రం లోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో 32 మంది బాధితులకు రూ. 30,46,059 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ భాధితులు ఈశ్వర రెడ్డి, బేతంచెర్ల రూ. 3,01,977 లు, బొర్రబేని వెంకటేశ్వర్లు యాదవ్, ఎన్. కొత్తపల్లి రూ. 30,786 లు, పి కిరణ్ కుమార్, నీలివిధి రూ. 26,884 లు, బోయ యెల్ల నాయుడు, శివపురం రూ. 36,500 లు, వడ్డే పార్వతి రైతునగరం రూ. 35,028 లు, ఎం.నరేంద్రనాథ్ రెడ్డికి మరణం గోవిందపల్లి, రూ.53,500 లు, రొద్ద సురేష్ కుమార్, ముజ్జాఫర్‌నగర్ రూ. 2,26,641 లు, షేక్ షఫీవున్, కొత్తపల్లి రూ. 60,781లు, కర్ణాటి విశ్వనాథ్ రెడ్డి, శ్రీశైలం రూ. 1,53,930 లు మాదినేని పర్వత నాయుడు ఎర్రగుడి, బనగానపల్లి రూ.1,30,267 లు, బొబ్బిటి ప్రభాకర్ రెడ్డి, నంద్యాల రూ. 1,76,539 లు, పెద్ద ముంతల నాగరత్నమ్మ శ్రీ నగర్ కాలనీ నంద్యాల, రూ. 70,000 లు, మహమ్మద్ గారి, షరీఫున్ బీ, సిరివెళ్ల రూ.1,00,310 లు, గుర్రం సుధా రాణి, మంచాలకట్ట రూ. 26,218 లు, దుదేకుల రేషమ్మ, కరిమద్దల రూ. 20,675 లు, వెంకట లక్ష్మమ్మ, రుద్రవరం రూ. 68,415 లు, వర్రా ఈశ్వరమ్మ, మూలసాగరం నంద్యాల రూ. 25,000 లు, ముక్కు సుబ్బలక్ష్మి, నంద్యాల రూ. 70,000 లు, మల్లిశెట్టి నాగ పూజిత, రాఘవేంద్ర నగర్, కర్నూలు రూ. 27,000 లు, పాణ్యం తులసమ్మ, నల్లగట్ల రూ. 92,445 లు, మల్లేల శివశంకర రెడ్డి గువ్వలకుంట్ల రూ. 1,00,567 లు, కొడితేం రామచద్రయ్య బనగానపల్లి రూ. 66,713 లు మల్లిరెడ్డి శ్రీనాథరెడ్డి, పెద్ద దేవలాపురం, శ్రీశైలం రూ, 35,000 లు, చిక్కొండ అయ్యన్న, బుజనూరు, పాణ్యం రూ. 30,000లు, వేణుగోపాల్ రెడ్డి, మూలసాగరం, నంద్యాల 2,46,454 లు, మేరమ్మ, వడ్డెమాన్, రూ.20,464 లు, మొల్లా రహిమాన్ బేగ్, వెలుగోడు, శ్రీశైలం రూ. 51,310లు, సుంకన్న, పెద్దపాడు, పాణ్యం రూ.52,655 లు, ఎన్. సావిత్రమ్మ, రుద్రవరం రూ. 45,000 లు, మాల జ్యోతి, సంజామల, రూ.65,000 లు, మైలా మాధవ కృష్ణయ్య, అయ్యలూరు, రూ.64,781లు, ఎం. శివ రామసుబ్బారెడ్డి, బనగానపల్లె రూ. 6,00,000 లక్షలు, ఇలా మొత్తం 32 మంది కి రూ 30,46,059 లక్షల సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పంపిణీ చేశారు. మా ఆసుపత్రి ఖర్చులకు సహకరించమని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని కోరగా వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సిఫారసు చేసి మాకు అండగా ఉండేందుకు అవసరమైన సీఎం సహాయ నిధి నిధులు మంజూరు చేసి ఆదుకున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి, సీఎం చంద్రబాబుకు భాధితులు ధన్యవాదములు తెలిపారు.

## అవినాష్‌కు రెడ్యం సోదరుల ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు



**కడప నంది పత్రిక ప్రతినిధి ఆగష్టు 25** కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత, కేఆర్సీ కెనాల్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పులివెందులలోని అవినాష్ రెడ్డి స్వగృహంలో ఆయనను పట్టు శాలువాతో సత్కరించి, పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు.అవినాష్ రెడ్డి హ్యాట్రిక్ ఎంపీగా ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ వెంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు రెడ్యం సోదరులు తెలిపారు.అనంతరం రెడ్యం వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. వివేకానందరెడ్డి హత్య కేసులో అవినాష్ రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారనే ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఈడీ సోదాలపై అవినాష్ రెడ్డితో చర్చించామని, ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆయనకు అండగా ఉంటామని తెలిపారు. అవినాష్ రెడ్డి కూడా తాను ఎలాంటి తప్పు చేయలేదని, ప్రజల కోసం పనిచేస్తూనే ఉంటానని చెప్పినట్లు వెల్లడించారు.వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి విషయంలో, అలాగే కేసుకు సంబంధించిన పలు అంశాలపై వైఎస్ సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి సమాధానం చెప్పాలని రెడ్యం డిమాండ్ చేశారు. కేసులోని కొన్ని పరిణామాలపై తాను గతంలో పలుమార్లు ప్రశ్నలు లేవనెత్తినా సమాధానం రాలేదని అన్నారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న "రాజకోట రహస్యం", "బిగ్ బాస్" ఎవరో వెల్లడించాలని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మైన్స్ మాజీ డైరెక్టర్ లింగారెడ్డి వీరప్రతాప్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు మల్లె ఓబయ్య యాదవ్, తిప్పసాని రంగారెడ్డి, దుగ్గిరెడ్డి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

# త్రాగునీటికోసం సిపిఐ రాస్తారోకో

### ఖాళీ బిందెలతో మహిళల నిరసన

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కోడుమూరు పట్టణంలో త్రాగునీటి సమస్యకి శాస్విత పరిస్కారం చూపాలని సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో పెద్దేత్తున మహిళలు ఖాలీ బిందెలతో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు త్రాగునీరు అందించే వరకు ఇక్కడినుండి కదిలేదే లేదని మహిళలు రోడ్డుపై బైటా యించారు. రవాణా స్థంభించిపోయింది. త్రాగునీటి సమస్యకు శాస్విత పరిష్కారం చూపాలని,హామీలు కాదు ఆచరణ చేపట్టాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి శేషకుమార్ మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యంతోనే కోడుమూరు పట్టణానికి త్రాగునీరు కరువైందన్నారు. ఎన్నికల్లో గెలిస్తే త్రాగు నీటి సమస్యను పరిష్కారం చేస్తామని హామీలు ఇచ్చి గెలిచిన పార్టీలు గాజుల ది న్నె ప్రాజెక్టు నుండి పత్తికొండ, కర్నూలు, డోన్ నాగరాలకు పైపులైన్ ద్వారా తరలిస్తున్న ఇక్కడి పాలకులు మాత్రం దగ్గర్లో ఉన్న ప్రాజెక్టు నుండి కోడుమూరు కు పైప్ లైన్ వేయలేకపోతున్నారని విమర్శించారు. త్రాగునీటి సమస్యపై నేతలు ఇచ్చే హామీలు మాకు వద్దని ఆచరణలో అమలు చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. 12 రోజులుగా కొండపేట, కొత్తపేట లల్లో, త్రాగునీరు లేక అవస్థలు పడుతుంటే అధికార్లు కార్యాలయాల్లో ఫ్యాన్ల కింద ఉండగా,హామీలు ఇచ్చిన నాయకులకు ప్రజల సమస్యలు పట్టవా అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఈశ్వరయ్య ఆచారి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ఏ ఐ వై యఫ్ నాయకులు కిషోర్, చేనేత కార్మికసంఘం నాయకులు మల్లయ్య, హమాలీ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, మార్కొండెయులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర సాంస్కృతిక శాఖ 500 కోట్ల రూపాయలు కేటాయించాలి

## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి రామచంద్రయ్య

**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాష్ట్ర సాంస్కృతిక శాఖకు ప్రతి సంవత్సరం 500 కోట్లు నిధులు కేటాయించి పేద కళాకారులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి రామచంద్రయ్య డిమాండ్ చేశారు, రాష్ట్రవ్యాప్తంగా కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం నాడు వివిధ కళారూపాలతో కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఏపీ ప్రజానాట్యమండలి నగర అధ్యక్షులు శివ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఈ రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కళాకారులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రం మాధురి రాష్ట్రంలో కూడా ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సారధిని ఏర్పాటు చేసి కళాకారులను ఆదుకోవడానికి ప్రతి సంవత్సరం ఆ శాఖకు 500 కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వి నాగరాజు మాట్లాడుతూ ఆంధ్రుల మొదటి రాజధాని కర్నూలు జిల్లాలో కళాకారుల కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో కళాక్షేత్రం లేకపోవడం బాధాకరమన్నారు రాయలసీమ జిల్లాల్లో ఉగ్గ కథలకు పెట్టింది పేరని గతంలో స్వాములు కళాకారులను ఆదరించే వారిని అయితే మారిన పరిస్థితులలో కళాకారులను ఆదరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కళాకారులు దైనందిన జీవితంలో అనేక అవస్థలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు పాలకులు ఎన్నికల అప్పుడు మాట్లాడుతూ కళలు కళాకారుల కోసం కాదని ప్రజలను చైతన్య పరచడానికని ఉచిత ప్రసంగాలు చెప్పే రాజకీయ నాయకులు అధికారం చేపట్టిన తర్వాత కళాకారులకు ఇవ్వవలసిన ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదని అందులో భాగంగానే ఈరోజు ఆందోళన చేస్తున్నామని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ స్పందించి ప్రతి కళాకారుడికి గుర్తింపు కార్డు మంజూరు చేయడంతో పాటు ప్రతి సంవత్సరం నంది నాటకోత్సవాలు నిర్వహించి ఏడాదిలో నిర్దిష్టమైన క్యాలెండర్ ను రూపొందించి కళారంగా అభివృద్ధికి పాటుపడాలని అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా పేద కళాకారులను గుర్తించి నెలకు 10 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వడంతో పాటు ప్రతి కళాకారుడికి మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి ఐదు లక్షల ఇవ్వాలని అదేవిధంగా ఉగాది పురస్కార ఎంపికలో పారదర్శకత నిజాయితీ ప్రదర్శించాలని ఆయన డిమాండ్ చేశారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కళాకారుల గురించి నిర్లక్ష్యం విడనాడి వారి అభ్యున్నతికి పాటుపడకపోతే ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆట పాట మాటలతో



ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ప్రజలకు వివరించి కళాకారుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాడుతామని ఆయన హెచ్చరించారు ఈ ధర్నాకి ప్రముఖ కళాకారుడు నంది అవార్డు గ్రహీత మహమ్మద్ మియా, జానపద కళాకారుని మంజుల లు సంపూర్ణ మద్దతు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి నగర సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు వెంకట రాముడు, నాయకులు డప్పు మాణిక్యం, బద్రి, పెద్దమల్లి, అశోకు, జకరయ్య, మధు, సుంకన్న, కళాఖర్, కర్ణాకర్,కోలాటం మహిళలు మునెమ్మ, వరలక్ష్మి, జ్యోతిబాయ్, లక్ష్మి, ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనివాసులు, బీసన్న, నాగరాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు అశోక్, డ్రమ్స్ కళాకారులు శివ నాగరాజు తదితరుల బృందం పాల్గొని అనేక జానపదాలు విప్లవ గేయాలు ఆలపించి నిరసన తెలియజేశారు అనంతరం కలెక్టర్ కార్యాలయ సి సెక్షన్ సూపర్డెంట్ ఇంద్ర కి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

# రాయలసీమకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయాలి.

## పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలపై నిర్లక్ష్యం తగదు: గాలి చంద్ర



**నంది ప్రతినిధి, ఆగస్టు 25, కడపజిల్లా.మైదుకూరు:** శ్రీశైలంలోకి భారీగా వరద నీరు చేరుతున్నా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి రాయలసీమకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర విమర్శించారు. మంగళవారం మైదుకూరు నాలుగు రోడ్ల కూడలిలో నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో రాయలసీమలో వర్షాభావం నెలకొని సాగు, తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పోతిరెడ్డిపాడు నుంచి 44 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి తెలుగుగంగ, కేసీ కెనాల్, ఎస్ఆర్‌బీసీ, గాలేరు-నగరి ప్రాజెక్టులకు నీరందించాలని డిమాండ్ చేశారు. 80 శాతం పూర్తయిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేయడం రాయలసీమకు అన్యాయమన్నారు. నీటి విడుదలపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని గాలి చంద్ర హెచ్చరించారు.

# మంత్రాలయం నియోజకవర్గంలో కూటమి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** మంత్రాలయం నియోజకవర్గంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు , విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన సందర్భంగా కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ వారికి ఘన స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా ముందుగా మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌లో పాల్గొని, మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలు తదితర అంశాలపై నాయకులతో చర్చించారు. అనంతరం మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మంత్రాలయం నియోజకవర్గ కూటమి కార్యకర్తల సమావేశంలో గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు , రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ , జోనల్-5 ఇన్‌చార్జి శ్రీనివాస రెడ్డి, ఎంపీ శ్రీ బస్తిపాటి నాగరాజు, కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ, మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న, బీజేపీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్ రెడ్డి, మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముఠాకక్షలకు దూరంగా ఉండాలి ఖాజీపేట సీఐ వంశీధర్



**కడప నంది పత్రిక ప్రతినిధి ఆగష్టు 25** ఖాజీపేట: ముఠాకక్షలకు దూరంగా ఉంటూ ఆత్మీయ వాతావరణంలో జీవించాలని, పిల్లలకు మంచి విద్య అందించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ఖాజీపేట సీఐ వంశీధర్ సూచించారు. ముత్తు లూరు పాడు గ్రామంలో సోమవారం రాత్రి పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన 'మేలుకొలుపు' నాటకం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పోలీస్ కళా-జాగృతి ఇన్‌ఛార్జ్ జి. నరసరామ్ బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఠాకక్షలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్, రహదారి భద్రత, సోషల్ మీడియా వినియోగం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకుని, ఎన్నికల అనంతరం గొడవలు, వివాదాలకు దూరంగా ఉండాలని సీఐ సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కడప ఫ్యాక్షన్ జోన్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గ్రామాల్లో ముఠాకక్షలు, డ్రగ్స్, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కళాబృందం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కుక్కల గురించి పట్టించుకోరా!



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 25 :** ఇందు గలవు! అందు లేవని సందేహం వలదు! ఏ సందులో చూసినా కుక్కల మయమే! బండి ఆత్మకూరులో కుక్కల సంచారం అధికం కావడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామంలో ఎక్కడ చూసిన గుంపులు గుంపులుగా కుక్కలు దర్శనమిస్తున్నాయి. పాఠశాలలకు పిల్లలను పంపాలంటే తల్లిదండ్రులు భయపడిపోతున్నారు. ఎక్కడ తమ పిల్లలపై దాడి చేస్తాయో అని తల్లడిల్లి పోతున్నారు. బండి ఆత్మకూరు సంత మార్కెట్లోనూ, ప్రైవేట్ పరిసరాల్లో, చికెన్ సెంటర్ ల వద్ద కుక్కలు అధికంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని ప్రాంతాలలో కుక్కలు గ్రూపులుగా ఏర్పడి, తమ సామ్రాజ్యాన్ని విస్తరింప చేసుకుంటున్నాయి. తమ ప్రాంతం వైపు మరే కుక్క రాకుండా పెత్తనం చెలాయిస్తున్నాయి. రాత్రిపూట బస్టాండ్ నుండి పాదచారులు ద్విచక్ర వాహనదారులు గ్రామంలోకి రావాలంటేనే హడలిపోతున్నారు. పార్నపల్లి, ఏ కోడూరు గ్రామాలలో రాత్రిపూట ద్విచక్ర వాహనాలు దారుల వెంటపడి కుక్కలు వేధిస్తున్నాయి.ద్విచక్ర వాహనదారుల వెంట కుక్కలు వెంటపడి భయాందోళనలను సృష్టిస్తున్నాయి. కుక్కలు వెంట పడడంతో ఎంతోమంది కిందపడి గాయాల పాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. చికెన్ షాప్ సెంటర్ ల వద్ద వ్యర్థ పదార్థాలను పడేస్తూ ఉండటంతో కుక్కలు ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని గత రెండు సంవత్సరాల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యం. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కుక్కల బెడదను నివారించడంలో చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రాథమిక ఉన్నత పాఠశాలకు బీరువ అందజేత



**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 25 . (నంది పత్రిక ):** రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రాయమాల్పురం మండల ప్రాథమిక ఉన్నత పాఠశాలకు 14 వేల రూపాయలు విలువ చేసే బీరువాను లక్కాభూషణం సహకారంతో అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సుధా ప్రసాద్ రెడ్డి సెక్రటరీ లక్ష్మీకాంత్ రెడ్డి అసిస్టెంట్ గవర్నర్ దండే దస్తగిరి లక్కా భూషణం రామచంద్రయ్య కండె హరినాథ్ అనిల్ సాగర్ రామచంద్రారెడ్డి అయ్యన్న హెడ్మాస్టర్ లక్ష్మణ్ నాయక్ ఉపాధ్యాయులు ఓబయ్య సుజాత సత్యవతమ్మ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన 'లిటిల్ ఏంజెల్స్' విద్యార్థిని దీక్షశ్రీ



**వెలుగోడు ఆగస్టు 25(నంది పత్రిక):** అమరావతి ఛాంపియన్ షిప్ లో భాగంగా నిర్వహించిన మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి అండర్-17 చెస్ పోటీలలో వెలుగోడు పట్టణానికి చెందిన 'లిటిల్ ఏంజెల్స్ పాఠశాల' 10వ తరగతి విద్యార్థిని దీక్షశ్రీ అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ విషయాన్ని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.ఎఫ్. ఇమ్మానియేల్ వెల్లడించారు. ఈ నెల 24 నుండి 29 వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలలో దీక్షశ్రీ నంద్యాల జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించి పాల్గొంటారని ఆయన తెలిపారు. నంద్యాల జిల్లా నుండి తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల యజమాన్యం మరియు ఉపాధ్యాయ బృందం తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.ఎఫ్. ఇమ్మానియేల్, ప్రధానోపాధ్యాయురాలు అప్ప్రియ ప్రశాంత మరియు ఉపాధ్యాయులు విద్యార్థిని దీక్షశ్రీని, ఆమె తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా విజయం సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# నేత్రదానం తో అందులకు కంటి చూపు వస్తుంది .



**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 25 ( నంది పత్రిక )** నేత్రదానం చేయడం వల్ల అందులకు చూపు వస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్ వెంకట రమణ పేర్కొన్నారు. కలెక్టర్ గారి ఆదేశాల మేరకు జిల్లా అందత్వ నివారణ అధికారి డాక్టర్ కే నాగరాణి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లా నివారణ మరియు దృష్టిలోప నివారణ నేత్రదాన జాతీయ పక్షోత్స వాల ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ ప్రారంభించారు ఈరోజు నుండి సెప్టెంబర్ 8వ తరగతి వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వము నిర్వహిస్తుంది నేత్రదానం గురించి విస్తృత ప్రచారం చేయడం మరియు ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం ఆరోగ్యవంతులు షుగర్ ఉన్నవాళ్లు బిపి ఉన్నవాళ్లు కంటి అద్దాలు వాడుతున్న వాళ్లు ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయవచ్చునని అధికారులు తెలిపారు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారు కుక్క కాటుకు గురి అయిన వారు నల్ల గుడ్డు దెబ్బతినినవాళ్లు హెపటైటిస్ బి తో ఉన్నవాళ్లు నేత్రదానం చేయకూడదని తెలిపారు ఒక వ్యక్తి కళ్ళను దానం చేయడం వల్ల ఇద్దరు అందులకు చూపును ఇవ్వడం సాధ్యమవుతుందని కంటికి కన్ను మీ సంకల్పం కావాలి నేత్రదానం మనందరికీ ఆదర్శం ఈ కార్యక్రమంలో జిల్లా అందత్వ నివారణ అధికారి డాక్టర్ కే నాగరాణి డాక్టర్ కె ఎస్ పి శ్రీనివాసులు డాక్టర్ యశోదర జిల్లా మాస్ మీడియా అధికారి మల్లేపల్లి పామున్న ఆప్తాలు మీకు ఆఫీసర్లు కిషోర్ ప్రసాద్ సత్యనారాయణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు



# ఎస్సీ కార్పొరేషన్ కు వెంటనే నిధులు కేటాయించాలి..

## రద్దు చేసిన 26 సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి..

## మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి..

**నంద్యాల బ్యూరో, ఆగస్టు25(నంది పత్రిక):-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ ప్రజలకు వెంటనే నిధులు కేటాయించాలని మాల సంఘాల రాష్ట్ర జేఏసీ కార్యదర్శి దస్తగిరి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం నంద్యాల కలెక్టర్ కార్యాలయంలోని డిఆర్ఓ రాము నాయక్ కు ఎస్సీ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన 26 ప్రభుత్వ పథకాలను పునరుద్దించాలని కోరారు. అదేవిదంగా ఎస్సీ కార్పొరేషన్ కు నిధులు కేటాయించి ఎన్ ఎస్ ఎఫ్ డి ఎస్ (నేషనల్ షెడ్యూల్ క్యాస్ట్ ఫైనాన్స్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్స్) పథకాన్ని తిరిగి కొనసాగించడంతో పాటు భూమి కొనుగోలు పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. ముఖ్యం గా ఎస్సీ నిరుద్యోగ యువకులు ఎదురుచూస్తున్న ఏపీ స్టడీ సర్కిల్ సెంటర్లను ప్రారంభించాలని కోరారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టి దళితులపై దాడులు చేసిన వారికి ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చిబాబు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.




# రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు శ్రీ శాంతినికేతన్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 25 ( నంది పత్రిక )** విజయనగరం జిల్లాలో సెప్టెంబర్ 11 నుంచి 13 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి సబ్-జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టు తరఫున నంద్యాల క్రాంతినగర్‌లోని శ్రీ శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు.ఆగస్టు 22వ తేదీన కర్నూలు ఏ-క్యాంప్‌లోని మాంటిస్సోరి హైస్కూల్ క్రీడా మైదానంలో కర్నూలు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు (ట్రయల్స్) నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలలో శ్రీ శాంతినికేతన్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు అత్యుత్తమ క్రీడా నైపుణ్యాన్ని కనబరిచి జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్నారు. ఎంపికైన విద్యార్థులు (10వ తరగతి):

బి. తరుణ్ కుమార్ రెడ్డిఎస్. సుదీప్ కుమార్ రెడ్డి ఎ. బాలాదిత్య ఎమ్. సంతోష్ ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల చైర్మన్ సుధాకర్ ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ఎంతో అభినందనీయమని, విజయనగరంలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా ఉత్తమ ప్రదర్శన కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, పీఈటీలు మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొని ఎంపికైన విద్యార్థులను ఘనంగా అభినందించారు.



# ప్రపంచస్థాయి ఎక్మో సేవల్లో హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్ మరో ఘనత..

### అవయవాలు చెడిపోయిన వారికి పునర్జన్మ కల్పిస్తున్నాం. ఊపిరి తిత్తులు..లివర్..కిడ్నీ లు మార్చి ప్రాణాలు కాపాడుతున్నాం.,

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 25 ( నంది పత్రిక )** ప్రపంచస్థాయి అత్యవసర వైద్య సేవలు, ట్రాన్స్‌ప్లాంట్ కేర్‌లో విశేష సేవలందిస్తున్న హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్‌కు ఎక్మో ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించిందనీ ఆసుపత్రి వైద్యులు నిశాంత్ పేర్కొన్నారు.నంద్యాల పట్టణం సూరజ్ గ్రాండ్ లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆసుపత్రిలో చేస్తున్న వైద్య సేవలు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యున్నత ప్రమాణాలతో ఎక్మో ఎక్స్ట్రాకార్పోరెల్ లైఫ్ సపోర్ట్ ఆర్గనైజేషన్ నుంచి ప్లాటినం సర్టిఫికేషన్ సెంటర్ గా గుర్తింపు పొందిందన్నారు.ఈ గుర్తింపుతో భారతదేశంలో ప్లాటినం స్థాయి గుర్తింపు పొందిన ప్రముఖ ఎక్మో కేంద్రాల్లో యశోద హాస్పిటల్స్ ఒకటిగా నిలిచింది అని పేర్కొన్నారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగులకు ఆధునిక లైఫ్ సపోర్ట్ అందించడంలో ఆసుపత్రి వైద్య బృందం అనుసరిస్తున్న అంతర్జాతీయ ప్రమాణాలకు ఈ గుర్తింపు నిదర్శనమని అన్నారు.అత్యాధునిక ఎక్మో సేవలు



యశోద హాస్పిటల్స్‌లో వి.ఎ,వి.వి. ఈసిపియర్ వంటి వివిధ రకాల ఎక్మో చికిత్సలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. గుండె, ఊపిరితిత్తులు తదితర అవయవాల పనితీరు తీవ్రంగా దెబ్బతిన్న రోగులకు ఎక్మో ద్వారా అవసరమైన లైఫ్ సపోర్ట్ అందిస్తున్నామన్నారూ.ఇందుకోసం క్రిటికల్ కేర్ వైద్యులు, కార్డియోథొరాసిక్ సర్జన్లు, పెర్ఫ్యూషనిస్టులు, ట్రాన్స్‌ప్లాంట్ నిపుణులు, ప్రత్యేక శిక్షణ పొందిన ఐసీయూ నర్సులతో కూడిన బహుళ విభాగాల వైద్య బృందం సేవలందిస్తోంది అన్నారు.

**ట్రాన్స్‌ప్లాంట్ కేర్‌తో సమన్వయం** అత్యాధునిక సేవలతో పాటు గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, ఎముక మజ్జ తదితర అవయవ మార్పిడి సేవలను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఎక్మో సేవలను ట్రాన్స్‌ప్లాంట్ కార్యక్రమాలతో అనుసంధానం చేయడం ద్వారా అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న రోగులకు మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులను వేగంగా, సురక్షితంగా ఆసుపత్రికి తరలించేందుకు ప్రత్యేక ఎయిర్ అంబులెన్స్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

**రోగుల ప్రాణ రక్షణే లక్ష్యం** యశోద హాస్పిటల్స్ వైద్యులు కృషిచేస్తున్నారని అన్నారు. ప్లాటినం గుర్తింపు, తమ వైద్య బృందం పాటిస్తున్న అత్యున్నత క్లినికల్ ప్రమాణాలకు గుర్తింపు అని పేర్కొన్నారు. ఎక్మో వంటి అత్యంత సంక్లిష్టమైన లైఫ్ సపోర్ట్ చికిత్సలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అందిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో రోగుల ప్రాణాలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రపంచస్థాయిఎక్మో క్రిటికల్ కేర్, ట్రాన్స్‌ప్లాంట్ సేవలను ఒకే వేదికపై అందిస్తూ యశోద హాస్పిటల్స్ వైద్య రంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించిందని పేర్కొన్నారు.యశోదా ఆసుపత్రిలో ఎక్మో వైద్యసేవలు మూడేళ్లుగా అందుబాటులో ఉండి ఎందరో ప్రాణాలు కాపాడమన్నారు.ఆగిపోయిన గుండెకు సి.పి.అర్ చేసి రోగులకు ఎక్మో పరీక్షలు చేసి రోగులకు పునర్జన్మ ప్రసాదించామన్నారు.గత నెలలో 12 మంది ప్రాణాలు కాపాడమన్నారు.రోగులు హైదరాబాద్ కు రాలేని వారు ఒక్క ఫోన్ చేస్తే నంద్యాల లో నే శాంతిరామ్,క్రిటికల్ కేర్ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందిస్తున్నారు.అవయవాలు చెడిపోయిన వారికి యశోదా ఆసుపత్రి పునర్జన్మ ప్రసాదిస్తుందని అన్నారు.రోగులు పూర్తి వివరాలకు 9247906103 నెంబర్ ను సంప్రదించాలని కోరారు.ఈ సమావేశంలో బాబయ్య,సుమంత్ పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.

### రానున్న గణేశ్ ఉత్సవం, దసరా పండుగలు, స్థానిక ఎన్నికల వేళ పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలి. ప్రాపర్టీ నేరాలను చేధించాలి.... రికవరీలు చేయాలి. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లాలో నేర నియంత్రణే లక్ష్యంగా పోలీసులు సమర్ధవంతంగా పనిచేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశించారు.మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రానున్న గణేశ్ ఉత్సవాలు, దసరా పండుగ, దేవరగట్టు బన్నీ ఉత్సవం, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.పోలీసు అధికారులు గ్రామాలను సందర్శించి స్థానిక పరిస్థితులను స్వయంగా పరిశీలిస్తూ, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఆయా మండలాల్లోని గ్రామపంచాయతీల్లో ఎలాంటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.ఎక్కడైనా సంఘటన జరిగినా, సమస్య తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు.

ఎన్నికల సమయంలో పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. సమస్యాత్మక వ్యక్తులను గుర్తించి అవసరమైన చోట పూచికత్తుతో ముందస్తు బైండోవర్ చర్యలు చేపట్టాలన్నారు.పెండింగ్ లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లను త్వరితగతిన అమలు చేయాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత జిల్లాలోని ఆయుధా(తుపాకులు)లను ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్దేశించిన గడువులోపు డిపాజిట్ చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు.పెండింగ్ కేసుల దర్యాప్తులను వేగవంతం చేసి, మిస్సింగ్ కేసులు, ప్రాపర్టీ నేరాల దర్యాప్తును పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు.ప్రాపర్టీ నేరాలను ఫింగర్ ప్రింట్, క్లూజ్ టీం తో త్వరితగతిన చేధించాలన్నారు .



**విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు.** అనధికారిక బాణసంచా కలిగి ఉన్న గోదాములు, దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా కలిగి ఉంటే కేసులు నమోదు చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా మాట్లాడుతూ రానున్న ఎన్నికల విధులలో గట్టి భద్రతతో పని చేయాలన్నారు.

**నిష్పక్షపాతంగా పని చేయాలన్నారు.** ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డీఎస్పీలు వెంకట్రామయ్య, వెంకటరమణ, దుర్గాప్రసాద్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది





### రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నంద్యాలలో ఘనంగా క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అసోసియేషన్ దైవసేవకుల ఆత్మీయ అవగాహన సదస్సు హాజరైన రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 25 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని ఎస్ఆర్బీసీ కాలనీలో గల బెతెస్త తెలుగు బాప్తిస్టు ప్రార్థన మందిరంలో 'క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అసోసియేషన్' ఆధ్వర్యంలో మంగళవారం దైవసేవకుల ఆత్మీయ అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవ సమాజ సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. సమాజంలో శాంతి, సమానత్వం, సేవా భావాన్ని పెంపొందించడంలో దైవసేవకుల పాత్ర ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు.

క్రైస్తవులకు రాజ్యాంగబద్ధంగా అందాల్సిన అన్ని సంక్షేమ పథకాలు, ప్రయోజనాలు చేకూరేలా ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ప్రతినిధులు క్రైస్తవుల సంక్షేమం, ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మంత్రి ఫరూక్ కు వినతిపత్రం అందజేశారు .

ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న , టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు, టీడీపీ క్రిస్టియన్ సెల్ పట్టణ అధ్యక్షులు బిషప్ డా. కె. బాలచంద్రుడు, వాక్యోపదేశకులు బిషప్ డా. ఇమ్మానుయేలు సన్నిధి, రెవ. డా. మారివూరి నాగేంద్రబాబు, తోట్టెంపూరి చంద్రశేఖర్, రెవ. ఇటికిల మల్లికార్జున, పాస్టర్ రాజేష్, పాస్టర్ అన్నపురెడ్డి రాజేష్, పాస్టర్ వై. రమేష్ బాబు, పాస్టర్ ఆశీర్వాదం,

పాస్టర్ టి. యోనాతాన్, పాస్టర్ అశోక్ కుమార్, పాస్టర్ పి. జోషువా, పాస్టర్ కిషోర్ కుమార్, బుగ్గ రాముడు , మరాఠీ సూరి తదితర సంఘ పెద్దలు, దైవసేవకులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షం కోసం గంగమ్మకు పూజలు

### తంగడంచ చెరువులో గంగమ్మకు పూజలు చేస్తున్నమత్స్యకారులు

**జూపాడుబంగ్లా: ఆగస్టు: 25: (నంది పత్రిక )** వానలు కురవాలని...తమ కష్టాలు తీరాలని గంగమ్మకు అమ్మవారికి మంగళవారం మత్స్యరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని మత్స్యకరరులు దేవాలయాల్లోని స్వామి అమ్మవాళ్లకు జలాభిషేకం నిర్వహించారు. ఇప్పటివరకు చేసిన కష్టం, పెట్టుబడి నేల పాలు అవుతోంది. ఇప్పటికైనా దేవుడు కరుణించి వర్షము కురిపించాలని గంగమ్మ తల్లి అనుగ్రహం కలగాలని మండలంలోని తంగడంచ గ్రామ ప్రజలు సమీపములోని చెరువులో గంగమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 'వరుణ దేవుడా కరుణించు' అని అడుగుడము కంటే ఏమి చేయలేకపోతున్నారు. ప్రత్యేక పూజలు, జలాభిషేకము జరిపించారు. దేవుళ్ళు కరుణించి వర్షాలు కురిపించాలని కోరుకున్నారు.



## రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థికి బ్రాంజ్ మెడల్

### విద్యార్థినిని చైతన్య లక్ష్మి అభినందించిన స్కూలు డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి



**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 25 ( నంది పత్రిక )** శ్రీ గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి చైతన్య లక్ష్మి రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో సత్తా చాటారు. ఈ నెల 21, నుండి 23వ తేది వరకు శ్రీకాకుళంలో నిర్వహించిన తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ చూపి బ్రాంచ్ మెడల్ సాధించినట్లు శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి తెలిపారు. విద్యార్థిని చైతన్య లక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించేందుకు కృషిచేసిన నంద్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాస్టర్ అబ్దుల్ మజీద్ ను ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బోధన్ తో పాటు క్రీడల్లో ఆసక్తి పెంచేలా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఇంటర్నేషనల్ స్కూల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి మరిన్ని పతకాల సాధించాలని ఆకాంక్షించారు.

## వైఎస్ నగర్ శ్రీ ద్రాక్షాయణి సిద్ధేశ్వరాలయ అభివృద్ధికి గోళ్ళ రాజేష్ రూ. 2 లక్షల విరాళం.!

### గోళ్ళ రాజేష్ దాతృత్వానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు ప్రజలు..!



**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 25 ( నంది పత్రిక )** నంద్యాల నివాసి, ప్రముఖ దాత, వ్యాపార వేత్త గోళ్ళ రాజేష్ చూపిన ఉదారత, దైవభక్తి స్థానికులలో గొప్ప స్ఫూర్తిని నింపాయి. నిర్మాణ దశలో ఉన్న శ్రీ ద్రాక్షాయణి సమేత సిద్ధేశ్వర ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు నేడు గోళ్ళ రాజేష్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అభివృద్ధి కోసం ఆయన తన వంతు సహాయంగా రూ. 2,00,000/- (రెండు లక్షల రూపాయల) ఆర్థిక విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు సంబంధించిన విరాళం చెక్కును ఆలయ కమిటీ ప్రతినిధి ఉమాకాంతయ్యకు రాజేష్ అందజేశారు. ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ మాట్లాడుతూ.. ఆలయాల నిర్మాణం, అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం కావడం మన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. కేవలం ఈ ఆర్థిక సహాయంతోనే ఆగిపోకుండా, భవిష్యత్తులో కూడా ఆలయ పురోగతికి, భక్తుల సౌకర్యార్థం ఎలాంటి అవసరాలు వచ్చినా తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు గోళ్ళ రాజేష్ దాతృత్వాన్ని ప్రత్యేకంగా అభినందించారు. స్వామివారి దివ్య ఆశీస్సులు ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ, ఆలయ కమిటీ తరపున వారికి ప్రత్యేక పూజలు చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటువంటి మహోన్నతమైన సేవా గుణం సమాజంలో మరికొందరికి ఆదర్శం కావాలని స్థానికులు కొనియాడారు.

## విధి నిర్వహణలో ప్రతిభకు సేవా పతకాలు...

### నిబద్ధతతో పని చేసిన వారికి గౌరవం... 35 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి 'అతి ఉత్కృష్ట', 'ఉత్కృష్ట' సేవా పతకాలు ప్రదానం చేసిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్

**కర్నూల్ సిటీ నంది పత్రిక** విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన పోలీసు అధికారులు, సిబ్బందికి కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో 202526 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అతి ఉత్కృష్ట, ఉత్కృష్ట పొందిన 35 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ 'అతి ఉత్కృష్ట సేవా పతకాలు', 'ఉత్కృష్ట సేవా పతకాలు' అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావంతో విశిష్ట సేవలు అందించిన వారికి ఈ గౌరవం దక్కిందన్నారు. . సేవా పతకాలు పొందిన వారిని మిగతా పోలీసు సిబ్బంది ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

**అతి ఉత్కృష్ట సేవా పతకాలు 14 మంది కి**

1. పి. ఏసురత్నం, ఏ ఆర్ యస్ ఐ -9996 డి ఏ ఆర్ , కర్నూలు.
2. యు.ఎం. శ్రీనివాసులు, ఏ యస్ ఐ -2193 గూడూరు పీయస్
3. టి. నాగభూషణరావు, పి సి -742 వెల్దుర్తి పీయస్
4. ఎం.సి. వెంకటస్వామి, పి సి -2289 చిప్పగిరి పీయస్
5. పి. మోహన్‌రెడ్డి, ఏ ఆర్ హెచ్ సి -3022 డి ఏ ఆర్ , కర్నూలు
6. వి. ఎర్రన్న, పి సి -3005 ఉలిందకొండ పీయస్
7. జి. మహమ్మద్ సిరాజుల్ అమీర్, ఏ ఆర్ పి సి -53 డి ఏ ఆర్ , కర్నూలు
8. ఎం.డి. హనీఫ్, హెచ్ సి -2568 కె.నాగలాపురం పీయస్
9. బి. వీరారెడ్డి, హెచ్ సి -1344 ఎమ్మిగనూరు ట్రాఫిక్ పి యస్
10. వై. హరిచంద్రుడు, హెచ్ సి -465 కె.నాగలాపురం పియస్
11. పి. సౌందర్‌రాజు, ఏ ఆర్ పి సి -426 డి ఏ ఆర్ , కర్నూలు
12. జరదొడ్డి దేవదానం, హెచ్ జి -419 పత్తికొండ యూనిట్
13. వన్నాల రఘు, హెచ్ జి -43 కర్నూలు యూనిట్
14. పఠాన్ దిదార్ ఖాన్, హెచ్ జి -146 కర్నూలు యూనిట్

**ఉత్కృష్ట సేవా పతకాలు 21 మందికి**

1. బి.వి. విక్రమసింహ, ఇన్‌స్పెక్టర్ కర్నూలు ×ం టౌన్ పీయస్
2. కె. దివాకర్, పి సి -1373 ఓర్వకల్లు పీయస్
3. కె. రవీంద్ర సింగ్, పి సి -1982 ఓర్వకల్లు పీయస్
4. బి. శ్రీనివాసులు, పి సి -1191 సీసీ యస్ , కర్నూలు
5. ఎం. దేవదాసు, పి సి -1675 ఓర్వకల్లు పీయస్
6. కె. హరి ప్రసాద్‌రెడ్డి, పి సి -206 ఆదోని ×× టౌన్ పీయస్
7. డి.పి. రాజకుల్లాయప్ప, పి సి -1332 డీటీసీ , కర్నూలు
8. పి. రఘునాథ్, పి సి -1398 హాలహర్వి పీయస్
9. కె. కృష్ణకుమార్, పి సి -1466 కర్నూలు ×ం టౌన్ పీయస్
10. ఎం.వి. అనంతరామ్, పి సి -775 కర్నూలు ×× టౌన్ పీయస్
11. ఆర్.ఎం. నాగరాజు, పి సి -582 ఉలిందకొండ పీయస్
12. ఎం. కృష్ణ, పి సి -29 కర్నూలు తాలూకా యు పి యస్
13. జి. పూర్ణబాయి, డబ్ల్యు హెచ్ సి -1035 మాధవరం పీయస్
14. పి. మద్దిలేటి స్వామి, ఏ ఆర్ పి సి -594 డి ఏ ఆర్ , కర్నూలు
15. బి. విజయభాస్కర్, ఏ ఆర్ పి సి -962 డి ఏ ఆర్ , కర్నూలు
16. పి. నాగశేషు, ఏ ఆర్ పి సి -904 డి ఏ ఆర్ , కర్నూలు
17. మంగలి తిప్పయ్య, హెచ్ జి -361 ఆదోని యూనిట్
18. సింగోటి వెంకటరమణ, హెచ్ జి -384 కర్నూలు యూనిట్
19. కెంచుగుండు గోపాల్‌రావు, హెచ్ జి -666 ఎమ్మిగనూరు యూనిట్
20. హరిజన రంగస్వామి, హెచ్ జి -1054 పత్తికొండ యూనిట్
21. బానావత్ రామకృష్ణ నాయక్, హెచ్ జి -1127 కర్నూలు యూనిట్

ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# వేరుశనగ విత్తనాలలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి శిక్షించండి

## 27వ తేదీ జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం




**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లాలో ఈ సంవత్సరం మరియు గత సంవత్సరం విశిష్ట వేరుశనగ విత్తనాలు 100% సబ్సిడీ పైన రైతులకు ఇవ్వవలసిన విషయంలో దాదాపు మూడు కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని దీనిపైన సమగ్రమైన విచారణ జరిపి దోశులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27వ తేదీన కర్నూలు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం, మరియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్రయ్య పి పంపన్న గౌడ ఒక ప్రకటనలో తెలియజేశారు జిల్లాలో ఇంత పెద్ద మొత్తంలో వ్యవసాయ శాఖలో అవినీతి జరిగిన ఇంతవరకు ఎవరిపైన ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇంతకన్నా నీచమైన పని మరొకటి లేదుఅని రైతులకు సబ్సిడీపై ఇవ్వవలసిన విత్తనాలను అధికారులు అమ్ముకుంటే అడిగే వారు లేరు కేంద్ర ప్రభుత్వం 100% సభ్యుడితో విశిష్ట వేరుశనగ విత్తనాలను రైతులకు ఉచితంగా ఇవ్వాలని తెలియజేసింది దీనిని దొంగ చాటుగా అధికారులు అమ్ముకున్నారు రైతులకు ఈ స్కీం వచ్చినట్లు గాని లేదా ఈ విధంగా ఇచ్చినట్లు గాని ప్రకటనల ద్వారా గాని లేదా మీడియా ద్వారా గాని వ్యవసాయ అధికారులు ఎవరికీ తెలియజేయలేదు మండల స్థాయిలో జిల్లా స్థాయిలో ఉన్న అధికారులు కుమ్మక్కై ఈ చర్యకు పూనుకున్నారు దీనిపైన సమగ్రమైన విచారణ జరిపించాలని అవినీతి జరిగిందని వెలుగులోకి వచ్చిన విషయం బయటికి వచ్చినప్పటికీ కర్నూలు జిల్లా కలెక్టర్ కాంప్లెక్స్ లో ఇంత అన్యాయం జరుగుతున్న దీనిని అడిగే వారు లేకుండా పోతున్నారు సబ్సిడీలు సంక్షేమ కార్యక్రమాలు ఉచితాలు ఎన్ని వస్తున్నాయో ఎవరికీ తెలియకుండా చెప్పకుండా గుట్టు చప్పుడు కాకుండా అమ్ముకుంటున్నారు ఇంత తీవ్రమైన కరువు పరిస్థితుల్లో ఉన్నందువలన కేంద్ర ప్రభుత్వం ఎమ్మెల్యే 25వ సంవత్సరం గరీఫ్ రబీకి మరియు 2020 సంవత్సరం ఖరీఫ్ కు విత్తనాలు ఇస్తే వాటిని కూడా దొంగచాటుగా అమ్ముకున్నారు కావున తక్షణమే సమగ్రమైన విచారణ జరిపించాలి ఈ సొమ్మును రికవరీ చేయాలి నేరస్తులపై కేసులు నమోదు చేయాలని వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27 వ తేదీ తేదీన అన్ని మండల కేంద్రాల్లో ధర్నా నిర్వహించాలని ఒక ప్రకటనలు తెలియజేశారు.

# ప్రజల భద్రత, సైబర్ నేరాల నివారణ కు , చిన్నారులు, మహిళల పై నేరాల నివారణ, మహిళల చట్టాలపై , ఆన్ లైన్ ఇన్వెస్ట్ మెంట్, సోషల్ మీడియా మోసాల పై అప్రమత్తత... అవగాహన పోస్టర్లు ఆవిష్కరణ.

## ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశం అనంతరం జిల్లా ప్రజల భద్రత, అత్యవసర సేవలు, మహిళలు, చిన్న పిల్లల పై నేరాల నివారణ , చట్టాలు , సైబర్ నేరాల పై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పలు అవగాహన పోస్టర్లను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆవిష్కరించారు.

**ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...** నేరాల నియంత్రణలో పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం, అవగాహన ఎంతో కీలకమన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతతో పాటు సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ముఖ్యమైన హెల్ప్‌లైన్లు, సేవలు**

**చిన్నారుల భద్రత:** చిన్నారుల పై లైంగిక వేధింపులు లేదా ఇతర సమస్యలు ఎదురైతే చైల్డ్‌లైన్ 1098కు సమాచారం అందించాలి.

**మహిళల రక్షణ:** గృహ హింస, వరకట్న వేధింపులు, మహిళలపై వేధింపులు లేదా అక్రమ రవాణా వంటి సమస్యలు ఎదురైతే అత్యవసర సహాయం కోసం 112, 181, 1091 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలి.

**సైబర్ నేరాలపై అప్రమత్తత:** సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ .సైబరక్రైమ్ .గవర్నమెంట్ .ఇన్ పోర్టల్ లో లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని లేదా జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులను కూడా సంప్రదించాలి. సైబర్ మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా బ్యాంకుల సమన్వయంతో మోసపోయిన నగదును ఫ్రీజ్ చేసేందుకు, బాధితులకు నగదు తిరిగి అందేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఆన్‌లైన్ పెట్టుబడుల విషయంలో కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**సోషల్ మీడియా మోసాలు, వదంతులపై అప్రమత్తత:**

సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని గుడ్డిగా నమ్మకుండా, దాని నిజానిజాలను సరిచూసుకున్న తర్వాతే స్పందించాలని ఎస్పీ సూచించారు. సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలు, వదంతులు లేదా ఇతర సమస్యలపై సైబర్ మిత్ర 9121211100, సోషల్ మీడియా సెల్ 9121101103 నంబర్లను సంప్రదించాలని తెలిపారు

**మత్తు పదార్థాల నియంత్రణ:** గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే 1972 నంబర్‌కు సమాచారం అందించాలి.

**పోగొట్టుకున్న మొబైళ్ల రికవరీ సి ఈ ఐ ఆర్ :**

మొబైల్ ఫోన్ పోయినప్పుడు లేదా దొంగతనానికి గురైనప్పుడు సి ఈ ఐ ఆర్ (సెంట్రల్ ఈక్వయిప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ) పోర్టల్ ద్వారా దానిని బ్లాక్ చేసి, తిరిగి పొందే విధానం , మొబైల్ రిరకరికి తీసుకునే విధానంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారుఈ అవగాహన పోస్టర్ల ద్వారా పోలీసు అధికారులు ఆయా పోలీసుస్టేషన్ ల పరిధులలో పట్టణాలు, గ్రామాలను సందర్శించి ప్రజలకు అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్లు, సైబర్ నేరాల నివారణ, మహిళలు మరియు చిన్నారుల భద్రత, మత్తు పదార్థాల నియంత్రణ, పోగొట్టుకున్న మొబైళ్ల రికవరీ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, డీఎస్పీలు వెంకట్రామయ్య, వెంకటరమణ, దుర్గాప్రసాద్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# పార్నపల్లి లో తహసిల్దారు విచారణ



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 25 :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్) కార్యక్రమానికి సంబంధించి తాసిల్దార్ పద్మావతమ్మ విచారణ నిర్వహించారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న పార్నపల్లి గ్రామంలో మంగళవారం తాసిల్దార్ విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటర్ల జాబితాలో అర్హులైన పౌరుల పేర్లు ఉండేలా చర్యలు తీసుకుంటామని నిబంధనల ప్రకారం అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకొని సర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తాసిల్దార్ పేర్కొన్నారు. ఓటు హక్కు కు అర్హత ఉన్నప్పటికీ ఓటర్ జాబితా లో పేరు లేకపోయినప్పటికీ వివరాల్లో తప్పులు ఉంటే సరైన ఆధారాలతో తమ దృష్టికి తీసుకొని వస్తే వెంటనే పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు వయసు నుండి ఓటు హక్కుకు అర్హత కలిగిన యువకులు తమ ఓటరు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ నాగరాజు సూపర్వైజర్లు నాగేశ్వరయ్య,అబ్దుల్ కలాం, బిఎల్వోలు మాధవి, శ్రీకాంత్,అనిత తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ జాబితాను విడుదల చేసిన ఎంపీడీవో నూర్జహాన్ బేగం



**ఆళ్లగడ్డ, ప్రతినిధి ఆగస్టు 25 నంది పత్రిక** స్థానిక ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేస్తుంది. ఇందులో భాగంగా ఆళ్లగడ్డ మండలంలోని గ్రామపంచాయతీలలో మంగళవారం బీసీ, ఎస్సీ, ఎస్టీల వారిగా ఓటర్ జాబితాను ఎంపీడీవో నూర్జహాన్ బేగం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామపంచాయతీలలో ఓటరు జాబితా విడుదల చేసినట్టు తెలిపారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో జాబితాను ప్రచురణ చేసామన్నారు. మండలంలో 168 వార్డులు ఉన్నాయన్నారు. ఈనెల 26 నుంచి 28 వరకు అభ్యంతరాలు స్వీకరించినన్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ఈనెల 29 నుంచి వచ్చే నెల రెండు వరకు ఎంక్వయిరీ ఉంటుందన్నారు. వచ్చే నెల ఏడవ తేదీన తుది జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రాఘవేంద్ర రాజు , ఎస్జిఎస్ డబ్ల్యూ అధికారి సరళ, రాఘవేంద్ర రెడ్డి మరియు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల రక్షణ కొరకే శక్తి యాప్



**కొత్తపల్లి - నంది పత్రిక :** సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడానికి శక్తి యాప్ ఉపయోగపడుతుందని మహిళల భద్రత కొరకే శక్తి యాప్ అని పాములపాడు ఏఎస్ఐ షేక్ నూర్ అహమ్మద్ ఐసిడిఎస్ సూపర్వైజర్లు నాగేశ్వరమ్మ, కుమారి తెలిపారు. మంగళవారం కొత్తపల్లి మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ టీచర్లకు జరుగుతున్న జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో శక్తీ యాప్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఉన్న మహిళల రక్షణ అందరి బాధ్యత అన్నారు. బాలికలు, మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన " శక్తి యాప్ అందరూ ఉపయోగించుకోవాలి అన్నారు. ఆపద లో ఉన్న ప్రతి మహిళ శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 ఫోన్ చేసి ఆపద నుంచి బయట పడాలి అన్నారు. మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి, బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఎలా చర్యలు తీసుకోవాలని అంశాలు వివరించారు. 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని తెలిపారు. అంగన్వాడీ టీచర్ సెల్ లో శక్తి యాప్ కచ్చితంగా ఉండాలి అని తెలిపారు. గ్రామాల్లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు మహిళలకు ఉన్న చట్టాలపై అవగాహన చేసుకోవాలి అన్నారు. కార్యక్రమంలో శక్తి టీం సిబ్బంది సుప్రియ గ్రామాల్లో ఉన్న అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలో విద్యార్థుల అలంకరణ పై వింత ఆంక్షలు

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 25:** మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల వ్యక్తిగత అలంకరణలపై వింత ఆంక్షలు విధిస్తున్నారన్న విమర్శలు గుప్పు మంటున్నాయి. నుదుటిపై బొట్టు పెట్టుకోకూడదని, జడలో పూలు పెట్టరాదని, కాళ్లకు పట్టీలు, చేతులకు గాజులు ధరించకూడదని కొందరు ఉపాధ్యాయులు ఆంక్షలు విధిస్తున్నట్లుగా సమాచారం. జడకు రిబ్బన్లు సైతం తాము సూచించిన విధంగానే కట్టుకోవాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. పాఠశాల నాయకత్వం వహించే విద్యార్థినీ, విద్యార్థులతోనే ఈ ఆంక్షలను తోటి విద్యార్థులపై అమలు చేయించినట్లు సమాచారం. ప్రభుత్వ నిబంధనలు పక్కనపెట్టి పాఠశాలలో సొంత నిబంధనలు అమలు చేసే అధికారం వీరికి ఎవరిచ్చారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారాన్ని ప్రోత్సహించిన ఉపాధ్యాయులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? పాఠశాలలో ఇలాంటి పద్ధతులకు అడ్డుకట్ట వేయకుండా మండల విద్యాశాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. చదువు చెప్పాల్సిన బడిలో వ్యక్తిగత ఆదేశాలే నిబంధనలుగా మారితే.. పర్యవేక్షణ వ్యవస్థ ఏం చేస్తున్నట్లు? ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయా? ఇకపై ఇలాంటి పద్ధతులు పునరావృతం కాకుండా మండల విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే.

# కోడి గుడ్డు పై మదర్ థెరిస్సా చిత్రం



**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 25 . (నంది పత్రిక ) :**నంద్యాలలకు చెందిన డి మాణిక్య రావు ఒక ప్రవేట్ బ్యాంకు పని చేస్తూ మదర్ థెరిస్సా జన్మదినం సందర్భంగా కోడి గుడ్డు పై మదర్ థెరిస్సా చిత్రం ను వేయడం జరిగినది. దీనిని డ్రాయింగ్ చేయడానికి దాదాపు రెండు గంటల సమయం పట్టినది. మదర్ థెరిస్సా అంటే నాకు ఎంతో ఇష్టం ఆమె చేసిన సేవా కార్యక్రమలు ఆమె చేసిన పరిచర్య నన్ను ఎంతగానో ఆకర్షించినవి ఎంతగానో ప్రేరేపించినవి. మదర్ థెరిస్సా మీద ఉన్న అభిమానం తో ఈ చిత్రం ను వేయడం జరిగినది.

# టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తాం: రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్



**నంద్యాల సిటీ బ్యూరో ఆగష్టు 25 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని ఎస్ఆర్బీసీ కాలనీలో ఉన్న టిడ్కో గృహ సముదాయాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కల్పనను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలి ఉన్న పనులను నాణ్యతా ప్రమాణాలతో, యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఫరూక్ ఆదేశించారు. అర్హులైన పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని, అన్ని హంగులతో ఇళ్ల పూర్తి చేసి అతి త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామని మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , పబ్బతి వేణు, బుగ్గ రాముడు, మరాఠీ సూరి మరియు సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ




**రుద్రవరం ప్రతినిధి ఆగస్టు 25 (నంది పత్రిక):** రుద్రవరం మండలంలోని గ్రామ పంచా యతీల లో కులాల వారీగా ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రచు రించినట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పంచాయతీల లో ఎస్సీ ఎస్టీ బీసీ ఓటర్లను గుర్తించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ఫారం 1 ద్వారా ప్రచురించడం జరిగిందన్నారు. ముసాయిదా జాబితా పై ఎస్సీ ఎస్టీ బీసీ ఓటర్ల గుర్తింపు పై అభ్యంతరాలను ఈనెల 28 వరకు (ఫారం-2, ఫారం-3, ఫారం-4) ద్వారా స్వీకరించటకు గ్రామపంచాయతీ కార్యాలయాలలో తగిన ఏర్పాట్లు చేయడం జరిగింది అని తెలిపారు. గ్రామాలలోని ఓటర్లు ఓటర్ల ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలను సరి చేసుకోవాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి మండలంలోని 21 గ్రామపంచాయతీలలో పోలింగ్ కేంద్రాల వివరాలు కూడా గ్రామపంచాయతీ కార్యాలయం లో అందుబాటులో ఉంచడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు.

# వాస్సర్ ల్యాబ్స్ బృందం ద్వారా పంటల పరిశీలన.



**రుద్రవరం ప్రతినిధి ఆగస్టు 25 (నంది పత్రిక)** రుద్రవరం మండలం లోని ఎర్రగుడిదిన్నె, చిలకలూరు, పేరూరు గ్రామాల మధ్య లో విజయవాడ కు చెందిన వాస్సర్ ల్యాబ్స్ సాంకేతిక నిపుణుల బృందం మండల వ్యవసాయాధికారి జి.సుమతి ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి పంటలు పరిశీలించారు . ఏపీ ఏఐ ఎంఎస్ యాప్ ద్వారా రైతులకు అందిస్తున్న వాతావరణ సూచనలు తుఫాను మరియు కరువు హెచ్చరికలు యాప్ పనితీరును సాంకేతిక సిబ్బంది సాయిచరణ్, తిరుపతి సమన్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట సాగు విస్తీర్ణం పంట ఆరోగ్య పరిస్థితి మరియు యాజమాన్య పద్ధతులపై సమాచారము రైతులకు యాప్ ద్వారా పొందవచ్చని వారు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్లో రైతులు సాగు చేసిన పంట పొలాల యొక్క ఆరోగ్య స్థితిని యాప్ లో అప్రమత్తంగా వచ్చిన పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు .వ్యవసాయ శాఖ ద్వారా వస్తున్న వాతావరణ సందేశాలు పంట స్థితిగతులు రైతులకు అవగాహన కల్పించి వెంటనే చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను పంపుతున్నామని వారు తెలిపారు .యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో తీసుకున్న వాస్తవాలను అభిప్రాయాలను ప్రభుత్వానికి చేరవేస్తామని వారు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి జి. సుమతి మాట్లాడుతూ ఖరీఫ్ 2026 రైతులు సాగు చేసిన పంటలను రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారులు ఎం. రాజు, ఎస్. ఫహీమ తబస్సుమ్, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి , భవాని , గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

## వరి పంటకు ఈ నెల 31 తేదీ లోపు బీమా చేసుకోండి

## ఏవో నాగేశ్వర్ రెడ్డి



**మహానంది ఆగస్టు 25 (నంది పత్రిక):-** ప్రతి రైతు తప్పనిసరిగా రైతు విశిష్ట సంఖ్య (ఫార్మర్ ఐడి) నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు.మహానంది మండలం నందిపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వ హించారు.ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతు తప్పనిసరిగా రైతు విశిష్ట సంఖ్య (ఫార్మర్ ఐడి) పొందడానికి వెంటనే సమీపంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. పంటల బీమా నమోదు చేసుకోవడానికి ఫార్మర్ ఐడి తప్పనిసరి అని తెలిపారు.వరి, కంది, మినుము, మొక్కజొన్నతో పాటు ఏ పంటనైనా ప్రభుత్వ సంస్థలకు మద్దతు ధరపై విక్రయించాలంటే ఫార్మర్ ఐడి తప్పనిసరి అని రైతులకు వివరించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడానికి కూడా రైతు విశిష్ట సంఖ్య ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇంకా ఫార్మర్ ఐడి పొందని లేదా పెండింగ్‌లో ఉన్న రైతులు వెంటనే రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు. పంట రుణాలు తీసుకున్న రైతులు వరి పంటకు బీమా చేయించుకోవడానికి ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని,అర్హులైన రైతులు తాము పంట రుణం తీసుకున్న సంబంధిత బ్యాంకులను వెంటనే సంప్రదించి వరి పంటకు బీమా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ మరియు రైతులు పాల్గొన్నారు.

# మీలాదున్ నబీ వేడుకలకు ముస్తాబైన మసీదులు



**కడప నంది పత్రిక ప్రతినిధి ఆగస్టు 25** వైఎస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండలంలోని సర్వర్‌ఖాన పేట, ఖాజీపేట గ్రామాల్లో మీలాదున్ నబీ వేడుకలకు మసీదులు ముస్తాబయ్యాయి. మహమ్మద్ ప్రవక్త జన్మ దినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని మసీదులను విద్యుత్ దీపాలతో అందంగా అలంక రించారు. రాత్రివేళ విద్యుత్ కాంతులతో మసీదులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.మీలాదున్ నబీ సందర్భంగా ముస్లిం సమాజం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులు, ప్రజలకు అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే మీలాదున్ నబీ వేడుకల్లో భాగంగా ప్రత్యేక ర్యాలీ నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శాంతియుత వాతావరణంలో వేడుకలను నిర్వహించేందుకు నిర్వాహకులు చర్యలు చేపట్టారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, మానవత్వం, పరస్పర గౌరవం వంటి సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే మీలాదున్ నబీ వేడుకల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. వేడుకలను పురస్కరించుకుని గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోండి.

## నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ.



**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 25 నంది పత్రిక** అమరావతి ఛాంపియన్ షిప్ - 2026 లో పాల్గొంటున్న క్రీకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తారకరామ స్టేడియం, క్యాంపస్ స్కూలు , మహిళా విశ్వవిద్యాలయం, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరుగుతున్న క్రీడా పోటీలను, ఏర్పాట్లను తిరుపతి నగర కమిషనర్ ఎం.జయకృష్ణ సందర్శించారు. వారికి కల్పించిన సౌకర్యాలను క్రీడాకారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని, పారిశుద్ధ్యం, తాగునీరు, విశ్రాంతి, వైద్య సౌకర్యాలు వంటి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చూడాలని అధికారులు ఆదేశించారు. క్రీడల ద్వారా యువతలో ఆరోగ్యకరమైన పోటీతత్వం, నిబద్ధత, క్రమశిక్షణ పెంపొందుతాయని అన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, సానిటరీ సూపర్వైజర్ చెంచయ్య మరియు సిబ్బంది, క్రీడాకారులు ఉన్నారు.



# మట్టి వినాయకులను పూజిద్దాం

## వినాయకుని నిమజ్జనం సమయంలో డీజేలు రద్దు



**మహానంది ఆగస్టు 25 (నంది పత్రిక):-** మట్టి వినాయకులను ఏర్పాటు చేసి పర్యావరణాన్ని పరిరక్షించు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహశీల్దార్ రమాదేవి ,ఎస్సై ఎన్. రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మహానంది మండలం గణేష్ కేంద్ర సమితి కమిటీ ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నుకున్నారు.కమిటీ గౌరవ అధ్యక్షులుగా జి.రామకృష్ణ, అధ్యక్షులుగా భూమా సుబ్బరామయ్య, ప్రధాన కార్యదర్శిగా మురళిని ఎన్నుకున్నారు. 30 మందితో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు.నంద్యాల జిల్లా గణేష్ కమిటీ నాయకులు భూమా రాజశేఖర్ రెడ్డి సమక్షంలో కమిటీ సమావేశం జరిగింది. ఎల్నినో ప్రభావం కారణంగా వర్షాభావం నెలకొనడంతో నీటి లభ్యత తక్కువగా ఉందని గ్రామాలలో మట్టితో తయారుచేసిన ఐదు అడుగుల లోపు విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.సంప్రదాయపద్ధంగా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి భక్తి భావంతో కార్యక్రమం నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం గణేష్ కమిటీ సభ్యులు తహశీల్దార్ , ఎస్ ఐ ను కలిసి కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు.అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనాల ప్రకారం వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. వినాయకుని నిమజ్జనం ఏర్పాట్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లే చర్యలు చేపడతామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులకు జై కొట్టాలని సూచించారు. వినాయకుని నిమజ్జనం సమయంలో డీజేలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గణేష్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ ప్రశాంతి ఐఏఎస్



**మహానంది ఆగస్టు 25 (నంది పత్రిక):-** ఓటర్ లిస్ట్ నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ ప్రశాంతి ఐఏఎస్ ఆదేశించారు. రాబోయే స్థానిక ఎన్నికల సందర్భంగా మహానంది మండలం లోని గాజులపల్లి, తదితర గ్రామాలలో పోలింగ్ బూత్ లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె బిఎల్వోలతో మాట్లాడుతూ ఓటర్ లిస్ట్ నమోదులో ఎటువంటి అవకతవకలు జరగకూడదన్నారు చనిపోయిన వారి పేర్లను గుర్తించి తొలగించాలని తెలిపారు.అనంతరం శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కల్యాణ మండపంలో వేదపండితులు రవిశంకర్ అవధాని,నాగేశ్వర శర్మ ల వేదమంత్రోచ్చారణ మధ్య ఏ ఈఓ మధు వస్త్రాలను సమర్పించి ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.వారివెంట ఆర్డిఓ విశ్వనాద్,తహశీల్దార్ రమాదేవి,సూపర్డెంట్ శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య, ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యనారాయణ, ఏపిఓ మల్లికార్జున,తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ( ఎస్ ఐ ఆర్) ప్రక్రియను పరిశీలించిన పరిశీలకులు గంధం చంద్రుడు.



**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 25 నంది పత్రిక** 167- తిరుపతి అసెంబ్లీ నియోజక వర్గం లో జరుగుచున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ పరిశీలకులు, కార్మికశాఖ కమిషనర్ గంధం చంద్రుడు మంగళవారం పరిశీలించారు. మంగళవారం మధ్యాహ్నం నగరంలోని పోస్టల్ కాలనీ సచివాలయంలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియను నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎం. జయకృష్ణ తో కలిసి పరిశీలించారు. నోటీసులు ఎంతమందికి అందించారు? ఎంతమంది విచారణకు హాజరయ్యారు? తదితర విషయాలను తెలుసుకుని పలు సూచనలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ కారణాల చేత నోటీసులు అందిన ఓటర్లు వారికి షెడ్యూల్ చేసిన తేదీన విచారణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హాజరు కానీ వారు ఎందుకు రాలేదు తెలుసుకుని వారికి తగు సౌకర్యాలు కల్పించి విచారణ పూర్తి చేయాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 11 డాక్యుమెంట్లలో 1987 కు ముందు జన్మించినట్లయితే వారి స్వంతానికి సంబందించి ఒక డాక్యుమెంట్, ఆ తరువాత మరియు 02.12.2004 మధ్యన జన్మించినట్లయితే వారి స్వంత డాక్యుమెంట్, తల్లిదండ్రులలో ఎవరిదైనా ఒక డాక్యుమెంట్, 02.12.2004 తరువాత జన్మించినట్లయితే వారి స్వంత డాక్యుమెంట్, తల్లిదండ్రుల ఇద్దరి డాక్యుమెంట్ సమర్పించాలని తెలిపారు. నోటీసులు విచారణలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ పరిశీలనలో డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తహసీల్దార్ సురేష్ బాబు, ఎన్నికల ఉప తహసీల్దార్ సుధాకర్ నాయక్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ ఆదిత్య జూనియర్ కళాశాల యందు నేత్రదాన అవగాహన వైద్య శిబిరం




**నంది పత్రిక ఆత్మకూరు..** ఆత్మకూరు, మంగళవారం: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఆత్మకూరులోని ఆదిత్య జూనియర్ కళాశాలలో మంగళవారం నేత్రదాన అవగాహన వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్యులు షేక్‌షావలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నేత్రదానం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో నేత్రదానం ద్వారా మరణానంతరం ఇద్దరు అంధులకు చూపు కల్పించే అవకాశం ఉందని వైద్యులు వివరించారు. మరణించిన వ్యక్తి నుంచి వీలైనంత త్వరగా, సాధారణంగా ఆరు గంటల్లోపు కార్నియాను సేకరించడం ద్వారా చూపులేని వారికి వెలుగును అందించవచ్చని తెలిపారు. నేత్రదానం చేయడం వల్ల దాత కుటుంబ సభ్యులకు ఎలాంటి ఆర్థిక భారం ఉండదని, నేత్రాలను సేకరించే ప్రక్రియ తక్కువ సమయంలోనే పూర్తవుతుందని చెప్పారు. వయస్సుతో సంబంధం లేకుండా అనేక సందర్భాల్లో నేత్రదానం చేయవచ్చని, ప్రజలు అపోహలను వీడి నేత్రదానానికి ముందుకు రావాలని వైద్యులు సూచించారు.కంటి చూపు కోల్పోయిన వారికి వెలుగును అందించడం ద్వారా మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని, తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు కూడా నేత్రదాన ప్రాధాన్యతను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విజయ భాస్కర్ నాయుడు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించండి సురక్షితంగా గమ్యం చేరండి



**మహానంది, ఆగస్టు 25 (నంది పత్రిక):-** ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరాలని మహానంది ఎస్ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి సూచించారు. మంగళవారం మహానంది మండల పరిధిలోని గాజులపల్లె- నంద్యాల రహదారి ఆంజనేయపురం చెక్పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వ హించారు. ఈ తనిఖీల్లో హెల్మెట్, సరైన పత్రాలు లేని పలువురికి జరిమానాలు విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్ ధరించక పోవడంవల్ల రోడ్డు ప్రమాదాలలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. సురక్షితంగా ఇంటికి చేరాలంటే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్, పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. 18 ఏళు నిండిన వారు మాత్రమే వాహ నాలు నడుపాలని, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోని ఉండాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. ఈ తనిఖీల్లో మహానంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ అవకాశం కల్పించాలి.



**బేతంచెర్ల ఆగస్టు 24 ( నంది పత్రిక )...**నంద్యాల జిల్లా,బేతంచెర్ల మండలం త్వరలో జరగా బోయే స్థానిక సంస్థల ఎన్నిక లలో ఇంద్రధనస్సు విభాగంలో, దివ్యాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ అవకాశం కల్పించాలని, స్ఫూర్తి బేతంచెర్ల దివ్యాంగుల స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు పీట్ల మద్దిలేటి, కార్యదర్శి బి.రాముడు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగామంగళవారం నాడు వారు మాట్లాడుతూ రాజ్యాంగా బద్ధమైన రాజకీయ హక్కులు,సమాన అవకాశాలు దివ్యంగులకు కల్పించ వలసిన అవసరం ఉంది రైట్ పర్సన్ విత్ దిశబిలిటీ యాక్ట్ 2016 ప్రకారం హక్కులను, చట్టాలను ఆమలు చేయకుండా, వాటి హక్కులను కనుమరుగు చేస్తూ తుంగలోకి చేస్తున్నాయి. ప్రభుత్వాలు ఇకనుంచి మనపై కళ్ళు తెరిచి, కేవలం ఓటు బ్యాంక్ గా కాకుండా, రానున్న భవిష్యత్ తరాల దివ్యాంగులకు మనం మార్గదర్శకం కావాలి. ఇకనుంచి మనం లేచి ప్రభుత్వాలు ప్రకటించే రాజకీయ రిజర్వేషన్లు,ఎన్నికల నిబంధనలపై దివ్యాంగులు పూర్తి అవగాహన పెంచుకోవాలని పిలుపు నిచ్చారు.అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రక్రియ ను అర్థం చేసుకుని, చట్ట భద్ధమైన హక్కులను వినియోగించు కోవాలని కోరారు, అలాగే స్థానిక పాలనలో దివ్యాంగుల సమస్యలు ప్రాథమిక అవసరాలు మరియు,రాజకీయ, ఆర్థికంగా,సామజిక, భాగస్వామ్యం పెరిగినపుడే దివ్యంగా సమస్యలు తెలుస్తాయన్నారు.కాబ్బటి ప్రజా ప్రతినిధులు మరియు ప్రభుత్వం దృష్టికి మరింత బలంగా వెళ్తాయని, ప్రతి ఒక దివ్యాంగులు ముందడుగు వేయాలని, పత్రిక ప్రకటన ధ్వారా విజ్ఞప్తి చేస్తున్నాము అని తెలిపారు.ఈ కార్యక్రమం లో శకుంతల,సురేష్,రామ్ మోహన్,శశిధర్,రామాంజనేయులు,మద్దమ్మతదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రారంభించిన అభివృద్ధి శిలాఫలకాలు ధ్వంసం

## టీడీపీ చేసిన అభివృద్ధిని తట్టుకోలేకే వైసీపీ శ్రేణుల దుశ్చర్య : టీడీపీ నాయకుల ఆరోపణ

**నంది పత్రిక కడప ఆగష్టు 25** ఖాజీపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామపంచాయతీలో ఇటీవల మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించిన స్మశానవాటిక, మెటల్ రోడ్డు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం స్థానికంగా కలకలం రేపింది. గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్మించిన స్మశానవాటికతో పాటు మెటల్ రోడ్డు పనులను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టిన విషయం మంగళవారం వెలుగులోకి వచ్చింది.

**రాజకీయ కక్షతోనే ధ్వంసం చేశారా?** శిలాఫలకాల ధ్వంసం ఘటనపై తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా స్పందించారు. కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక వైసీపీకి చెందిన కొందరు ఈ చర్యకు పాల్పడి ఉంటారని వారు ఆరోపించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని స్థానిక టీడీపీ నాయకులు పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఉంటే ప్రజల మధ్య చర్చించుకోవాలి కానీ, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన నిర్మాణాలు, శిలాఫలకాలను ధ్వంసం చేయడం సరికాదని అన్నారు. **బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలి** కొత్తపేటలో జరిగిన ఘటనపై అధికారులు, పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. గ్రామంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే శిలాఫలకాలను ఎవరు ధ్వంసం చేశారనే విషయం అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. పోలీసులు విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సి ఉంది. రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు తావులేకుండా ఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని స్థానికులు కోరుతున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రానుండడంతో ఇప్పుడు జరిగిన శిలాఫలకాల ధ్వంసం ఘటనతో కొత్తపేటలో మరోసారి రాజకీయ వేడి రాజుకోనుంది.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# ఆధార్ సేవలను వేగవంతం చేయాలి...!



డి ఎల్ ఏ ఎం సి సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

బయోమెట్రిక్ నవీకరణ, చిన్నారుల ఆధార్ నమోదుపై ప్రత్యేక దృష్టి

ప్రతి మండలంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలి

**కడప, బ్యూరో చీఫ్ ఆగస్టు 25: నంది పత్రిక** జిల్లాలో ఆధార్ నమోదు, వివరాల నవీకరణ ప్రక్రియలను మరింత వేగవంతం చేసి పెండింగ్‌ను తగ్గించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ డి ఎల్ ఏ ఎం సి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వర్చువల్ గా హైదరాబాద్ ఆధార్ రీజనల్ కార్యాలయం నుండి అసిస్టెంట్ మేనేజర్ జావీద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ముఖ్యంగా 0-5 ఏళ్ల చిన్నారుల ఆధార్ నమోదు, 5-15 ఏళ్లు, 15 ఏళ్లు పైబడిన వారి తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రమం తప్పకుండా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అర్హులందరికీ ఆధార్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 206 ఆధార్ కిట్లు పనిచేస్తుండగా, గత 30 రోజుల్లో 29,299 నమోదు, నవీకరణ లావాదేవీలు నమోదైనట్లు తెలిపారు. ప్రతి మండలాన్ని కవర్ చేసేలా క్రియాశీల ఆధార్ కేంద్రాలను అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అదనపు కిట్లు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో 5-15 ఏళ్ల వారికి 37,627, పదిహేనేళ్ళ పైబడిన వారికి 21,865 నమోదులకు కలిపి మొత్తం 59,492 తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణలు పెండింగ్‌లో ఉన్నాయని రికార్డుల ద్వారా తెలుస్తోందన్నారు. అయితే.. ఈ పెండింగ్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు పాఠశాలలు, అంగన్‌వాడీలను కేంద్రాలుగా చేసుకుని శిబిరాలు నిర్వహించాలని, నవీకరణ చేయించుకోని వారిని సచివాలయాల ద్వారా గుర్తించి సమీప ఆధార్ కేంద్రాలకు తరలించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా, తపాలా శాఖ, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని మొబైల్ పరికరాల ద్వారా ఇంటింటికీ లేదా శిబిరాల ద్వారా మొబైల్ ఆధార్ నవీకరణ సేవలను విస్తరించాలని సూచించారు. ఆధార్ నవీకరణకు అర్హులైన ప్రతి ఒక్కరికీ సేవలు అందేలా శాఖల మధ్య సమన్వయం పెంచాలని పేర్కొన్నారు.

**తప్పుడు ధ్రువపత్రాలపై అప్రమత్తంగా ఉండాలి** ఆధార్ నమోదు, నవీకరణలో తప్పుడు లేదా ద్వంద్వ ధ్రువపత్రాల వినియోగాన్ని అరికట్టేందుకు సంబంధిత శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ద్వంద్వ జనన ధ్రువపత్రాలు, ద్వంద్వ పదో తరగతి మార్కుల జాబితాలు, గడువు తర్వాత జారీ చేస్తున్న మాన్యువల్ నివాస ధ్రువపత్రాల అంశాలపై సమగ్ర పరిశీలన, ధ్రువీకరణ చేపట్టాలని సూచించారు. ప్రజల్లో ఆధార్ నవీకరణపై అవగాహన పెంచేందుకు జిల్లా అధికారిక సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగించాలని, ఆధార్ నవీకరణ అవసరమైన వారంతా సమీప కేంద్రాలు, ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ& ఎస్టిడిఓ డి. ప్రతాప్ రెడ్డి, సిఎస్‌సి డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్. సుబ్రమణ్యం, ఐసిడిఎస్ పిడి పి. రామాదేవి, పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ జి. రాజేష్, విద్యా శాఖ డిఈఓ (ఎస్‌ఈ) డా. షేక్ షంషుద్దీన్, డిఎంహెచ్‌ఓ డిఐఓ ఇన్‌చార్జ్ డా. జె. ప్రవీణ్ కుమార్, లీడ్ బ్యాంక్ ఎల్‌డిఎం ఇంచార్జి ఏ. శ్రీ పుష్పవాణి, పోలీసు ఇన్‌స్పెక్టర్ జి. ఇదుర్ బాషా సంబందిత కమిటీ అధికారులు పాల్గొన్నారు.



# ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలి

**"మిలాద్ ఉన్ నబీ " శుభాకాంక్షలు తెలిపిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్**



**అమరావతి, ఆగస్టు25. నంది పత్రిక:** ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, సంతోషం, ఆరోగ్యం, సౌభాగ్యం నిండాలని కోరుకుంటూ అందరికీ మిలాద్ ఉన్ నబీ పర్వదిన శుభాకాంక్షలను మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ముస్లిం సమాజంలో ఎంతో పవిత్రంగా భావించే పండుగల్లో మిలాద్ ఉన్ నబీ ఒకటని మంగళవారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని స్మరించుకుంటూ ఈ రోజును భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు. ప్రవక్త మహమ్మద్ జీవితాన్ని, బోధనలను పాటిస్తూ, ఆదర్శంగా నిలవాలని అన్నారు. నిజాయితీ, దయ, క్షమ, ప్రేమ, సహనం, ఇతరులకు సహాయం చేయడం వంటి విలువలకు ప్రవక్త ఇచ్చిన ప్రాధాన్యతను ఆదర్శంగా తీసుకోవాలని కోరుతూ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు మంత్రి ఫరూక్ తెలిపారు.

# ఆటపాటల ద్వారా విద్యను అందించడం వల్ల పిల్లలకు చదువు సులువుగా అర్థమవుతుంది

**అంగన్వాడి కేంద్రాల నుంచే పిల్లల చదువుకు బలమైన పునాది**

**ఐసిడిఎస్ సూపర్వైజర్లు దస్తగిరమ్మ ,పార్వతమ్మ**



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 25 నంది పత్రిక** అంగన్వాడి కేంద్రాల నుంచే పిల్లల చదువుకు బలమైన పునాది పడుతుందని సూపర్వైజర్లు దస్తగిరమ్మ, పార్వతి అన్నారు. పట్టణంలోని ఎద్దుల పాపమ్మ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం మంగళవారం ముగిసింది. మొదటి విడతలో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు, రెండో విడతలో ఈనెల 22, 24,25 తేదీలలో మొత్తం ఆరు రోజులపాటు శిక్షణ జరిగింది. చివరి రోజు మంగళవారం ఐసిడిఎస్ సూపర్వైజర్లు మాట్లాడుతూ ఆటపాటల ద్వారా విద్యను అందించడం వల్ల పిల్లలకు చదువు సులువుగా అర్థమవుతుందన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో బాలల హాజరు శాతం పెంచడంతో పాటు వారి పట్ల శ్రద్ధ వహించాలన్నారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వారు సూచించారు. అంగన్వాడీ టీచర్లు శిక్షణలో డిఆర్పిల ద్వారా నేర్చుకున్న ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో పాటించాలన్నారు. అంగన్వాడి కేంద్రాలు క్రమశిక్షణ కేంద్రాలుగా, ఆటపాటలతో వారికి విద్యాబోధన చేసే కేంద్రాలుగా ఉండాలన్నారు.

# పెండింగ్ అర్జీల పరిష్కారంలో జాప్యం తగదు..!





## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి రెవెన్యూ సేవల్లో 12 ప్రమాణికాల్లో పురోగతిపై సమీక్ష

**కడప, బ్యూరో చీఫ్ ఆగస్టు 25: నంది పత్రిక** ప్రజలకు రెవెన్యూ సేవలు వేగంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలు, సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన రెవెన్యూ అధికారుల సమావేశంలో రెవెన్యూ, ప్రజా సేవలకు సంబంధించి 12 ప్రధాన ప్రమాణికాల్లో పురోగతిపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తోపాటు.. జేసీ డా. నిధీమీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, డిఆర్వో మల్లికార్జునుడు హాజరయ్యారు. ఈ సమీక్షలో పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ, పునఃసర్వే, ప్రజా ఫిర్యాదులు, 22-ఏ కేసులు, భూసేకరణ, ప్రభుత్వ భూముల కేటాయింపు, భూముల బదలాయింపులు, జెడ్‌హెచ్‌డీసీ భూములు, రెవెన్యూ రికార్డుల డిజిటలీకరణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా ఫిర్యాదులను కేవలం పరిష్కరించినట్లు నమోదు చేయకుండా, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి సంతృప్తికరమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ సూచించారు. 22-ఏ జాబితాలో తప్పుగా నమోదైన భూములను నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే తప్పు నమోదుల తొలగింపుతో వచ్చిన ఫిర్యాదులపై దశల వారీగా భూ పరిష్కారం లభిస్తోందన్నారు. ఈ ప్రక్రియను ఇంకా వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పునఃసర్వేకు అనుకూలమైన గ్రామాల్లో ప్రక్రియను వేగవంతం చేసి పెండింగ్ దశలను పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ, ప్రభుత్వ భూముల కేటాయింపు ప్రతిపాదనలను సకాలంలో పూర్తి చేసి ఉన్నతాధికారులకు పంపాలన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ, వారసత్వ మార్పులు, ఉపవిభజనలు, డిజిటల్ సంతకాల ప్రక్రియలను వేగవంతం చేయాలని, ఐవీఆర్ఎస్ ద్వారా వస్తున్న ప్రజల స్పందనలను పరిశీలించి లోపాలను సరిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నెలా రెవెన్యూ సేవల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామని, తదుపరి సమావేశం నాటికి స్పష్టమైన పురోగతి కనిపించాలని అధికారులకు సూచించారు. అన్ని రెవెన్యూ సేవల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు అవసరమైన సేవలు నిర్ణీత సమయంలో అందేలా సిబ్బందిని సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలో పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, తదుపరి నెలవారీ సమీక్ష నాటికి స్పష్టమైన పురోగతి కనిపించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు మురళీ, శిరీష, చంద్రమోహన్, చిన్నయ్య లతో పాటు.. ఆయా రెవెన్యూ డివిజన్లలోని మండల తహసీల్దార్లు, డిటీలు, సంబందిత రెవెన్యూ అధికారులు. పాల్గొన్నారు.

# నేటి మొక్కలే రేపటి వృక్షాలు

**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి**




**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 25 నంది పత్రిక** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వృక్షయజ్ఞం వ్యవస్థాపకురాలు లావణ్య అన్నారు. పట్టణానికి సమీపంలో ఉన్న కాసింతల క్షేత్రంలో శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం వృక్షయజ్ఞం సంస్థ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వృక్ష యజ్ఞం వ్యవస్థాపకురాలు లావణ్య మాట్లాడుతూ ఆళ్లగడ్డ పరిసర ప్రాంతాలలో తమ వృక్షయజ్ఞం సంస్థ ద్వారా ఇప్పటికే పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. పర్యావరణానికి మేలు చేసే మొక్కలను నాటేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని పెంచితే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చున్నారు. అనంతరం సరోజమ్మ, సుబ్బమ్మ తదితర భక్తు బృందం ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, కాలభైరవాష్టకం తదితర పారాయణలు నిర్వహించి అన్నప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్వతి , పద్మావతి, శ్రీదేవి, భ్రమరాంబ, శ్రీనివాస రెడ్డి, కృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డి , గ్యాస్ పుల్లయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమగోదావరి జిల్లా డీఆర్ఓగా పి. గ్లోరియా బాధ్యతల స్వీకరణ



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 25 నంది పత్రిక**పశ్చిమగోదావరి జిల్లా జిల్లా రెవెన్యూ అధికారి (డి ఆర్ ఓ)గా పి. గ్లోరియా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇన్‌చార్జి డీఆర్‌ఓగా విధులు నిర్వహించిన పి. ప్రభాకర్ నుంచి ఆమె డీఆర్‌ఓ బాధ్యతలను స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని పి. గ్లోరియా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కు పుష్పగుచ్చం అందజేశారు. జిల్లా రెవెన్యూ వ్యవస్థకు సంబంధించిన అంశాలపై సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు..,

# అమెరికా చదువులపై విద్యార్థుల్లో అనాసక్తి

ట్రంప్ తీరుతో అమెరికాలో ఉంటున్న భారతీయులకు, అమెరికా వెళ్లాలనుకుంటున్న విద్యార్థులకు సైతం విసుగు వస్తోంది. పదేపదే ఏదో ఒక ఆంక్ష కారణంగా అక్కడి విశ్వవిద్యాలయాలు కూడా ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. భారతీయ విద్యార్థుల రాక తగ్గిందని అక్కడి సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. దీంతో ఆ దేశానికి వెళ్లాలనుకునే భారత విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. 'కామన్ యాప్' నివేదికల ప్రకారం.. 2024-25 విద్యా సంవత్సరంలో వివిధ అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో 3.63 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు చేరారు. ఇక 2025-26లో అమెరికా కళాశాలల్లో కోర్సులలో ప్రవేశం కోరే భారత విద్యార్థుల సంఖ్య 15శాతం పడిపోయింది. మరోవైపు 2026 సెమిస్టర్‌లో అమెరికా కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అంతర్జాతీయ విద్యార్థుల నమోదులో కూడా 1.1 లక్షల తగ్గుదల కనిపించింది.

# రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**





**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 25 నంది పత్రిక**జిల్లాలో చివరి దశలో 30 గ్రామాల్లో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను మరింత పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మండల సర్వేయర్లను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని వశిష్ట కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లాలోని మండల సర్వేయర్లతో జిల్లా కలెక్టర్ రీ సర్వే ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని చివరి దశలో ఉన్న 30 గ్రామాల్లో రీ సర్వేను నిర్ణీత నిబంధనల మేరకు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. రైతుల సమక్షంలో సర్వే నిర్వహించి, భూ వివరాల్లో ఎటువంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రైతుకు 9(2) నోటీసులు అందజేసి, తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయించాలని ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియలో రైతులకు ఎటువంటి సందేహాలు, ఇబ్బందులు తలెత్తకుండా వారికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డైరెక్టర్ ఆఫ్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయం నుంచి రీ సర్వే ప్రక్రియ కోసం పశ్చిమగోదావరి జిల్లాకు అందించిన అధునాతన ల్యాప్‌టాప్‌లను జిల్లాలోని 20 మండలాలకు చెందిన మండల సర్వేయర్లకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేకు సంబంధించిన పూర్తి డేటాను ల్యాప్‌టాప్‌లలో ఎప్పటికప్పుడు నమోదు చేసి, అవసరమైన సమయంలో అందుబాటులో ఉండేలా భద్రపరచాలని సూచించారు. రీ సర్వే ప్రక్రియను నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేసి రైతులకు ప్రయోజనం కలిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, జిల్లా సర్వే అధికారి కె .జాషువా, మండల సర్వేలు తదితరులు పాల్గొన్నారు.



# "సర్" రోల్ అబ్జర్వర్ కు స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ఫ్ ఆగస్టు 25 నంది పత్రిక** పశ్చిమగోదావరి జిల్లా సర్ రోల్ అబ్జర్వర్ ఎం. వేణుగోపాల్ రెడ్డికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఘన స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో అబ్జర్వర్ ఎం. వేణుగోపాల్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో సర్ రోల్ ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన పురోగతిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అబ్జర్వర్ ఎం. వేణుగోపాల్ రెడ్డికి వివరించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, షెడ్యూల్‌కు అనుగుణంగా పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సర్ రోల్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న చర్యలు, నోటీసుల పంపిణీ, పెండింగ్ అంశాలు, సంబంధిత అధికారులు తీసుకుంటున్న చర్యలపై అబ్జర్వర్ కు వివరించారు. సర్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు



# ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాల అందించుట కొరకు ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు





## ఎమ్మెల్యే పులవర్తి రామాంజనేయులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 25 నంది పత్రిక** పాలకోడేరు ఆరోగ్య కేంద్ర పరిధిలో కొవ్వాడ గ్రామ పంచాయితీలోని వెల్లటూరు గ్రామముల కార్పొరేషన్ హెల్త్ టెక్ మరియు స్మార్ట్ టెలి మెడిసిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారముతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ వారి ఆధ్వర్యములో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించడమైనది ఈ కార్యక్రమునకు ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే పులవర్తి రామాంజనేయులు మరియు జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ చదలవాడ నాగరాణి ప్రారంభించినారు. ఈ సభను ఉద్దేశించి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయములు అందించుట కొరకు ప్రజలకు ఉచితముగా వైద్య పరీక్షలు నిర్వహించినారు ఈ క్యాంపు నందు ప్రజలకు ఉచితముగా నివారణత్మక ఆరోగ్య సంరక్షణ, సాధారణ ఆరోగ్య పరీశీలన, గుండె సంబంధిత ఈసీజీ అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు, మరియు దంత చికిత్స, చెవు మరియు కంటి చికిత్సలు ఉచితముగా నిర్వహించి ప్రజలకు తగు ప్రాధమిక చికిత్స మరియు సలహాలు, సూచనలు ఇవ్వడము జరిగినది అవసరమైన వారికి పై ఆసుపత్రులకు రిఫరల్ సేవలు చేయడమైనది. ఈ కార్యక్రమము 25/08/2026, 26/08/2026 మరియు 27/08/2026 మూడు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుంది. కావున వెల్లటూరు గ్రామ ప్రజలు మరియు చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరడమైనది ఈ కార్యక్రమములో పశ్చిమ గోదావరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖధికారి వారు డా.యమ్.రవిబాబు ఎండి వీడి జిల్లా డిసిహెచ్ఎస్ డా.సూర్యనారాయణ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎన్ సి డి సి డి డా.కిషోర్ ఉమా మహేష్ రుజు వన్ వైస్ ప్రెసిడెంట్ పాలకోడేరు పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ డా.గులాబ్ రాజకుమార్ డా. కుసుమ జనరల్ ఫిజిషియన్, డా.కస్తూబా , డా.హషిత పెన్నాడ మెడికల్ ఆఫీసర్ పాల్గొనడం జరిగినది. మరియు ఈ కార్యక్రమములో డి సత్యనారాయణ పి ఎం ఓ ఓ మంచిలి,బి.రామకృష్ణ ఎం ఓ ఓ పీహెచ్సీ గొల్లవానితిప్ప, శాంతి గారు ట్రైనర్, పాలకోడేరు పీహెచ్ సి. సి హెచ్ ఓ సత్యనారాయణ, ప్రభాకర్రావు - ఎం పి హెచ్ ఈ ఓ శంకర్ ఎం పి హెచ్ ఎస్ మరియు పి.హెచ్.సి. ఎల్ హెచ్ పి లు ఏఎన్ఎం లు హెల్త్ అసిస్టెంట్స్, మరియు ఆషాలు పాల్గొని వారి విధులను నిర్వర్తించడం జరిగినది. ముఖ్యముగా ఈ కార్యక్రమములో వెల్లటూరు గ్రామ పెద్దలు అల్లూరి సుబ్రహ్మణ్యం రాజు అల్లూరి భాస్కర రాజు నీలి శ్రీనివాస్ సుబ్బరాజు డెక్కపాటి యోహాను నల్లమోతు రమేష్ పాల్గొని వారి సహాయ సహకారములు అందించడం జరిగినది.





## గోదావరి పుష్కరాలు ఏర్పాట్లుపై సీఎం చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 25. నంది పత్రిక** గోదావరి పుష్కరాలు -2027 ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రులు ,పుష్కరాల ప్రత్యేక అధికారి, ప్రభుత్వ కార్యదర్సుల తో కలిసి మంగళవారం సంబంధిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గోదావరి పుష్కరాల సందర్భంగా పుష్కర ఘాట్లు ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు, ఆయా ప్రాంతాలలో రోడ్ల అభివృద్ధి, రవాణా, భద్రత, తదితర ఏర్పాట్లకు సంబంధించి వివిధ శాఖల ఉన్నతాధికారులు సమర్పించిన ప్రతిపాదనలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆధ్యాత్మిక ఉట్టిపడేలా గోదావరి పుష్కరాలను నిర్వహించాలని సూచించారు. మంజూరైన పనులను త్వరితగతిన, నాణ్యత ప్రమాణాలతో చేపట్టి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. పశ్చిమగోదావరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు

## బాలికలకు ఆత్మ రక్షణకు కరాటే అవసరం కరాటే మాస్టర్ చంద్రమౌళి





**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 25 నంది పత్రిక** నేటి సమాజంలో బాలికలకు ఆత్మరక్షణ కొరకు కరాటే అవసరమని ప్రముఖ కరాటే మాస్టర్ చంద్రమౌళి అన్నారు మంగళవారం నాడు ఆళ్ళగడ్డ పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్ లో ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో బాలికలకు ఫిట్నెస్ ప్రోగ్రాం జరిగింది ఈ సందర్భంగా ప్రముఖ. కరాటే మాస్టర్ చంద్రమౌళి అమ్మాయిలు వారి ఆత్మ రక్షనకొరకు కరాటే లో కావలసిన మెలుకువలు తదితర టిప్స్ కరాటే లో శిక్షణ పొందిన వారిచే అద్భుతమైన విన్యాసాలను ప్రదర్శించారు అలాగే.చైన్ స్నాకర్స్ నుంచి ఎలా కాపాడుకోవాలి మరియు ఆకతాయి అబ్బాయిల నుండి తాము తాము ఏ విధంగా కాపాడుకోవాలి నేర్పించారు. ఈ కార్యక్రమంలో బాలికల ఉద్దేశించి ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ బైసాని ఉమామహేశ్వరి ప్రధాన కార్యదర్శి పి గీత ప్రసంగించారు. ప్రవల్లిక వై కవిత ఎం గాయత్రి దేవి లావణ్య హెచ్ రమా భాయ్ పాల్గొన్నారు





## 22 ఏ భూ సమస్యలపై 449 దరఖాస్తులు ఉండగా వాటిలో 180 దరఖాస్తులు పరిష్కరించాం

### జిల్లా కలెక్టర్ వేట్రి సెల్వి



**ఏలూరు బ్యూరో చీఫ్, ఆగష్టు, 25 నంది పత్రిక :** ఏలూరు జిల్లాలో జూన్ నుండి ఆగష్టు వరకు 22ఏ భూ సమస్యలపై 449 దరఖాస్తులు అందగా వాటిలో 180 దరఖాస్తులు పరిష్కరించామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర భూపరిపాలన శాఖ ముఖ్య కమీషనర్ జి. జయలక్ష్మి కి చెప్పారు. పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, 22ఏ భూ సమస్యల పరిష్కారం, రీ సర్వే, రెవిన్యూ సమస్యలు, పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం, తదితర అంశాలపై రాష్ట్ర సచివాలయం నుండి మంగళవారం రాష్ట్ర భూపరిపాలన శాఖ ముఖ్య కమీషనర్ జి. జయలక్ష్మి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ జయలక్ష్మి మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీకి పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని, 22ఏ భూ సమస్యలపై అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా నిబంధనల ననుసరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వే పనులను నిర్దేశించిన లక్ష్యాల మేర పూర్తిచేయాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులపై ధరఖాస్తుదారుని కలిసి సమస్య తెలుసుకుని నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు జిల్లా నుండి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జూమ్ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో జూన్ 15వ తేదీ నుండి ఆగష్టు 24వ తేదీ వరకు 22ఏ భూ సమస్యలపై 449 దరఖాస్తులు అందగా వాటిలో 180 దరఖాస్తులు పరిష్కరించామని, నిబంధనల మేరకు లేని 182 దరఖాస్తులను కారణాలు తెలియజేస్తూ తిరస్కరించామన్నారు. పెండింగ్ లో ఉన్న 87 దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆగష్టు నెలలో జిల్లాలోని 26 గ్రామాలలో 13 వేల 668 పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ లక్ష్యానికి గాను నూరు శాతం పంపిణీ చేశామన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో ధరఖాస్తుదారుని కలిసి సమస్య తెలుసుకుని నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి తెలియజేసారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, ఇంచార్జ్ డిఆర్ఓ దేవకీదేవి, నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఆర్డీఓ లు లక్ష్మీప్రసన్న, రమణ, ప్రభృతులు పాల్గొన్నారు.

## ఏపీఎల్ మహిళా క్రికెటర్ల వేలం

ఆంధ్రా క్రికెట్‌లో ఓ కొత్త శకం మొదలైందనడానికి నిదర్శనంగా నిలిచింది 12 ఏళ్ల షణ్ముఖ ప్రియ. రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న మహిళల ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఔ-ూూూ) కోసం జరిగిన వేలంలో ఈ చిన్నారిని రాయలసీమ జెన్ స్టార్స్ జట్టు కొనుగోలు చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఫ్రాంచైజీ క్రికెట్‌లో అతి పిన్న వయస్కురాలిగా నిలిచిన షణ్ముఖ ప్రియ, ఈ లీగ్ యువ ప్రతిభను ప్రోత్సహించడానికి ఎంతగా కట్టుబడి ఉందో చెప్పకనే చెబుతోంది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల నుంచి కూడా క్రీడాకారిణులను వెలుగులోకి తీసుకురావాలన్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ూజూ) లక్ష్యానికి ఈ ఎంపిక అద్దం పడుతోంది. విజయవాడలో జరిగిన ఈ ప్లేయర్ల వేలం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. మొత్తం నాలుగు ఫ్రాంచైజీలు 74 మంది మహిళా క్రికెటర్లను కొనుగోలు చేసేందుకు తీవ్రంగా పోటీపడ్డాయి. రాయలసీమ జెన్ స్టార్స్, అమరావతి ఈ-ఛాంపియన్స్‌తో పాటు వైజాగ్ ఫైర్ బర్డ్స్, గోదావరి గోల్డెన్ ఈగిల్స్ జట్లు తమకు కేటాయించిన రూ.15 లక్షల పర్స్‌తో బలమైన జట్లను నిర్మించుకున్నాయి.

**వేలంలో ఇతర ముఖ్యాంశాలు** ఈ వేలంలో ఆల్‌రౌండర్ ఫెరీరా హెన్రిటా అత్యధిక ధర పలికింది. ఆమెను గోదావరి గోల్డెన్ ఈగిల్స్ ఫ్రాంచైజీ రికార్డు స్థాయిలో రూ.4.30 లక్షలకు సొంతం చేసుకుంది. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌ను ఈ టోర్నమెంట్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం లీగ్‌కు మరింత ఆకర్షణ తీసుకొచ్చింది.

## సర్ ప్రక్రియపై అధికారులతో ఆల్ పొలిటికల్ పార్టీలతో సమీక్ష సమావేశం

### సర్ రోల్ అబ్జర్వర్ ఎం వేణుగోపాల్ రెడ్డి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 25 నంది పత్రిక** కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో' 'సర్ 'ప్రక్రియ పై మంగళవారం ఇఆర్ఓ లు, పొలిటికల్ పార్టీలతో సర్ రోల్ అబ్జర్వర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు సాధించిన ప్రగతిని నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. ఓటర్ల వివరాల ధృవీకరణ, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, క్లెయిమ్స్ అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కార ప్రక్రియపై ఇ ఆర్ఓ ల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా ఓటర్ల జాబితాను పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించాలని సూచించారు. సర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, అందిన క్లెయిమ్స్ అభ్యంతరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలన్నారు. ప్రతి దరఖాస్తును సంబంధిత రికార్డులతో పరిశీలించి, అర్హత ఉన్న ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సర్ ప్రక్రియ పూర్తి చేయడానికి మరోసారి గడువు ఉండదని అక్టోబర్ 2 వ తేదీలోగా మొత్తం ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఎక్కడ ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా బాధ్యతాయుతంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఓటర్ల హీరింగ్ సమయంలో ఏ ఏ డాక్యుమెంట్లు ఓటర్ల సమర్పించాలో బిఎల్ఓ లకు మరోసారి అవగాహన కల్పించాలన్నారు. ఇఆర్వోలు, ఏఈఆర్వోలు హీరింగ్ సమయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలో సర్ ప్రక్రియ ప్రగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ కార్యక్రమంలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు,ఆచంట, పాలకొల్లు, ఉండి, నియోజకవర్గాల ఇ ఆర్ ఓ లు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఎం సూర్యారావు, జెడ్ వెంకటేశ్వరరావు, డాక్టర్ కె .సి హెచ్ అప్పారావు, పి.ప్రభాకర్, కె.అనురాధ, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు మరపట్ల శ్యాం బాబు (టిడిపి), తోటగంగరాజు, (బిజెపి) ఎన్.మురళీకృష్ణ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) కామన నాగేశ్వరరావు, (వై ఎస్ ఆర్ సి పి) ఇ వి శేఖర్ బాబు (బి ఎస్ పి) ఎం ఆంజనేయులు (సి పి ఐ) పార్టీల తరపున పాల్గొన్నారు.



## నీట్ పీజీ ఎగ్జామ్స్ ఏర్పాట్లపై పై ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్

### నీట్ పీజీ ఎగ్జామ్ ఈనెల 30వ తేదీన ఉదయం 9 గంటల నుండి 12:30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుంది జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 25 నంది పత్రిక** కేంద్ర ప్రభుత్వ హెల్త్ సెక్రటరీ ఢిల్లీ నుండి మంగళవారం జిల్లా కలెక్టర్లతో నీట్ పీజీ ఎగ్జామ్స్ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ నీట్ పీజీ ఎగ్జామినేషన్ 30.08.2026 ఉదయం 9 గంటల నుంచి 12:30 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో రెండు సెంటర్లలో డిఎన్ఆర్ కాలేజ్, భీమవరం, ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ చినమేరం భీమవరం నందు ఈ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు 280 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు ఆమె తెలిపారు. ఎగ్జామ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని వివరించారు. కలెక్టరేట్ విసి హాల్ నుండి డిఆర్ఓ పి ప్రభాకర్, డీఈఓ కార్యాలయం సహాయ సంచాలకులు ఈ నారాయణ, శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మీ పోరాటంతోనే మేమిక్కడ ఉండగలిగాం













**స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలంతా కష్టపడాలి**

**ప్రతి ఒక్కరికీ అండగా పార్టీ నిలబడుతుంది**

**టిడిపికి పార్టీ కార్యకర్తలే నిజమైన బలం**

**అభివృద్ధి, ఉపాధి లక్ష్యంగా ఈ ప్రాంతం అభివృద్ధి**

**నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో లోకేశ్**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషి చేయాలని కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని అన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం రాయదుర్గం నియోజకవర్గం కణెళికల్ మండలం నల్లంపల్లిలో నిర్వహించిన నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'విజయనగరం రాజుల మూడో రాజధాని రాయదుర్గం. ఈ రాయదుర్గం కోటలో ఎంత పౌరుషం ఉందో.. ఇక్కడి ప్రజల్లోనూ అంతే పౌరుషం ఉంది. ఇక్కడ పట్టు చీరలు, జీన్స్ ఎంత ఫేమసో.. మీ ప్రేమ, అభిమానం, స్టైల్ కూడా అంతే ఫేమస్. అవన్నీ ఈరోజు ప్రత్యక్షంగా చూశాను. గత 11 ఎన్నికల్లో టీడీపీ కేవలం 4 సార్లు మాత్రమే గెలిచినా.. గెలిచినా, ఓడినా రాయదుర్గం నియోజకవర్గాన్ని గుండెల్లో పెట్టుకుని అభివృద్ధి చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు. ఓబుళాపురం గనుల పేరుతో అడ్డగోలుగా అక్రమ మైనింగ్ జరుగుతున్నప్పుడు కమిటీ వేసి ప్రజల తరఫున పోరాడింది టీడీపీ. నాడు మనం చేసిన పోరాటానికి ఫలితంగా తాజాగా తీర్పు వచ్చిందన్నారు. 'ప్రజల కోసం పోరాడింది.. ప్రజల తరఫున నిలబడింది తెలుగుదేశం పార్టీనే. మీ అందరి కష్టం, శ్రమతో 2024లో కాలవ శ్రీనివాసులును 43 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించుకున్నాం. పట్టుదల, క్రమశిక్షణతో నియోజకవర్గానికి నాయకత్వం వహిస్తున్న కాలవ శ్రీనివాసులు.. ఎప్పుడూ నియోజకవర్గ అభివృద్ధి గురించే మాట్లాడుతుంటారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎల్ నినో ప్రభావం ఉంది. ప్రజలకు తాగునీరు, పంటలకు సాగునీటి సమస్య రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాయదుర్గం ప్రాంతంపై కూడా ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ.. ప్రజలకు నీటి ఇబ్బందులు రాకుండా కాలవ శ్రీనివాసులు నిరంతరం కృషి చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అత్యధికంగా పెన్షన్లు అందిస్తున్నాం. దీపం 2.0 కింద ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నాం. తల్లికి వందనం, చేనేతలకు ఉచిత విద్యుత్, చేనేత సేవ, మత్స్యకార సేవ, ఆటోవాలా సేవ వంటి కార్యక్రమాల ద్వారా అన్ని వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ఆర్థిక సహాయం అందిస్తున్నాం'. 'పెన్షన్ల కోసం ఏటా రూ.35 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం.

ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీ ÷ల్‌పైనే చేశారు. వెంటనే దాన్ని కార్యాచరణలోకి తీసుకొచ్చి 16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. ఎన్ని కేసులు వేసి అడ్డుకోవాలని చూసినా నియామకాలు పూర్తి చేశాం. కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేశాం. 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటించాం. పరిశ్రమలను ఆకర్షిస్తూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం'.'నేడు పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్.. దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉంది. ఈ అభివృద్ధికి బ్రాండ్ చంద్రబాబు. గొడ్డలి పార్టీలో గొడ్డలి బ్యాచ్, ఫ్యాక్షనిస్టులు, దొంగలు ఉంటారు కాబట్టే వారి ఆలోచనలు కూడా అలాగే ఉంటాయి. కానీ చంద్రబాబు ఆలోచన ఎప్పుడూ రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం చుట్టూనే ఉంటుంది. ఆ మార్పును మనమంతా ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాం' అని నారా లోకేష్ తెలిపారు.అసెంబ్లీలో నియోజకవర్గ అభివృద్ధితో పాటు రాష్ట్రానికి అవసరమైన అంశాలపై కూడా మాకు విలువైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు' అని నారా లోకేష్ తెలిపారు. 'ఈ రోజు మేము మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా వేదికపై కూర్చున్నామంటే దానికి ప్రధాన కారణం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే. అహర్నిశలు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు ఎన్నో కేసులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా 2019 – 24 మధ్య దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు ఎదురైనా ఎత్తిన పసుపు జెండాను దించకుండా పార్టీ కోసం పోరాడారని అన్నారు. గొడ్డలి పార్టీ కుట్రలకు, అక్రమ కేసులకు భయపడకుండా నిలబడిన కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలైన బలం. అందుకే తెలుగుదేశం పార్టీ కార్యకర్తే అధినేత. దేశంలో మరే రాజకీయ పార్టీ కల్పించని విధంగా కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పిస్తున్న పార్టీ టీడీపీ. కార్యకర్తల సంక్షేమం కోసం ఇప్పటికే రూ.160 కోట్లు ఖర్చు చేశాం. కష్టపడి పనిచేస్తున్న నిజమైన కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం కల్పించడమే మా లక్ష్యం' అని నారా లోకేష్ చెప్పారు. యువగళం పాదయాత్రలో కార్యకర్తలను కలిసినప్పుడు.. 'పార్టీ కోసం పనిచేస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వండి.. మమ్మల్ని గుర్తించండి' అని చాలామంది కోరారు. అందుకే మైటీడీపీ యాప్‌ను తీసుకొచ్చాం. మీరు పాల్గొనే ప్రతి పార్టీ కార్యక్రమం, మీరు సొంతంగా చేపట్టే ప్రతి కార్యక్రమం పార్టీకి తెలియాలంటే మైటీడీపీ యాప్‌లో ఫీడ్ చేయండి. క్లస్టర్, యూనిట్, బూత్ సమావేశాల్లో మీరు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను మేము చదువుతున్నాం. మీరు చెప్పే సమస్యలు, సూచనలు మాకు చేరడం లేదనే అపోహ వద్దు. కొత్త పెన్షన్లు, ఇళ్లు ఇవ్వాలని కార్యకర్తలే ఫీడ్‌బ్యాక్‌లో కోరారు. కొత్త పెన్షన్‌లు ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిది. ఇలా మీరు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే నేను నిర్ణయాలు తీసుకుంటాను. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు కచ్చితంగా గుర్తింపు దక్కుతుంది. మీరు మమ్మల్ని వెతుక్కుంటూ రావాల్సిన అవసరం లేదు.. మేమే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాం అని అన్నారు. కోటి మంది సభ్యులతో కూడిన కుటుంబం మనది. సముద్రం లాంటి ఈ కుటుంబంలో సమస్యలు సహజం. మనలో మనమే చర్చించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలి. ఎక్కడైనా మీ సమస్య పరిష్కారం కాకపోతే మా దగ్గరకు రండి. మీకు అండగా నేను ఉంటాను. కార్యకర్తల కోసం, పార్టీ కోసం ఎప్పుడూ ముందుండి పనిచేస్తాం' అని కార్యకర్తలకు నారా లోకేష్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ నియోజకవర్గానికి వెళ్లినా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అనంతరం కార్యకర్తలను కలవడానికే ప్రాధాన్యత ఇస్తారు. ప్రతి కార్యకర్తతో మాట్లాడి, ఫొటో దిగి, వారి సమస్యలను తెలుసుకున్న తర్వాతే అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు. కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ఇచ్చే విలువకు ఇదే నిదర్శనం. 2025 మహానాడులో ప్రవేశపెట్టుకున్న ఆరు శాసనాల్లో 'కార్యకర్తే అధినేత' అనేది అత్యంత ముఖ్యమైనది. టీడీపీలో కార్యకర్తే అధినేత. అందుకే మహానాడు, అసెంబ్లీ, మండలి సహా పార్టీకి సంబంధించిన అన్ని కార్యక్రమాల్లో కార్యకర్తలు ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులతో కలిసి వేదికను పంచుకుంటున్నారు. 'కష్టపడి పనిచేసే కార్యకర్తకు గుర్తింపు, గౌరవం కల్పించడం టీడీపీ బాధ్యత. కార్యకర్తల సంక్షేమానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది. పార్టీ కోసం ప్రాణాలు వదిలిన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు చట్టాన్ని సవరించి బిల్లు తీసుకొచ్చాం. వైసీపీ ఎమ్మెల్సీలు అడ్డుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా చివరకు బిల్లును చట్టంగా చేసి చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాం. నమ్ముకున్న సిద్ధాంతం కోసం ప్రాణాలు అర్పించిన కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన గౌరవానికి ఇదే నిదర్శనం' అని లోకేష్ పేర్కొన్నారు. 'ఉమ్మడి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీకి కంచుకోట. మా కుటుంబాన్ని ఆశీర్వదించి గెలిపించిన ప్రజలు అనంతపురం జిల్లా ప్రజలు. నాడు ఎన్టీఆర్‌ని గెలిపించి అసెంబ్లీకి పంపించిన గొప్ప నేల ఇది. మా హరిమామను శాసనసభకు, పార్లమెంట్‌కు, మా ముద్దుల మామ బాలకృష్ణను మూడుసార్లు అసెంబ్లీకి పంపించిన ఘనత అనంతపురం ప్రజలది. ఈ అభిమానాన్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటాం. అహర్నిశలు మీ కోసం కృషి చేస్తానని హామీ ఇస్తున్నాను. అందుకే అనంతపురం జిల్లాకు ప్రత్యేక సంస్థలు, పరిశ్రమలు తీసుకొచ్చి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నాం అని అన్నారు. ఇప్పటికే సోలార్, విండ్ ఎనర్జీ రంగాల్లో భారీ పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ప్రతిష్టాత్మకమైన ఫైటర్ జెట్ తయారీ సంస్థ కూడా అనంతపురం ప్రాంతానికి సొంతమైంది. ఏ రంగంలో అయినా ఆరోగ్యకరమైన పోటీతత్వం ఉంటేనే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. అదే పోటీతత్వం ఎమ్మెల్యేల మధ్య కూడా ఉండాలి. ఉరవకొండలో తయారయ్యే విండ్‌మిల్‌పై 'మేడ్ ఇన్ ఉరవకొండ' అని మంత్రి కేశవ్ పెట్టుకుంటున్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాలకు కంపెనీలు తీసుకురావాలి.. తమ నియోజకవర్గానికి పేరు రావాలని పోటీతత్వంతో పనిచేయాలి' అని లోకేష్ కోరారు.








## గొడ్డలి పార్టీ హత్యారాజకీయాలతో అప్రమత్తంగా ఉండాలి

నేడు మనం గొడ్డలి పార్టీతో రాజకీయంగా పోరాడుతున్నాం అని మంత్రి లోకేశ్ అన్నారు. వారిలో వారే హత్యలు చేసుకుని.. ఆ నిందను మనపై వేసే నైజం వారిదని అన్నారు. . సొంత బాబాయిని హత్య చేసిన ఘటనలో ప్రొడక్షన్, డైరెక్షన్, ఫైనాన్స్ మొత్తం వాళ్లదే. 2019లో గొడ్డలి పార్టీకి చెందిన దొంగ పత్రికలో 'నారాసుర రక్త చరిత్ర' అంటూ ఫొటో ప్రచురించి చంద్రబాబుపై నిందలు వేశారు. ఆ ప్రచారాన్ని చూసి బాబాయి కుటుంబ సభ్యులతో పాటు ప్రజలు కూడా నమ్మారు. కానీ ఇప్పుడు ఒక్కొక్కటిగా వాస్తవాలు బయటకు వస్తున్నాయని అన్నారు. తాజాగా వారి ఎంపీ ఇంట్లోనే నోట్ల కట్టలు బయటపడటం దీనికి మరో ఉదాహరణ. కోడి కత్తి డ్రామా.. గులకరాయి డ్రామా. గులకరాయి వ్యవహారమైతే మరో హైలైట్. టెన్నిస్ బాల్ కంటే వేగంగా తిరిగిన ఆ రాయి.. జగన్‌కు తగిలి కింద పడాల్సింది పోయి పక్కనే ఉన్న ఓ నటుడికి తగిలిందట. మరీ విచిత్రంగా ఆ నటుడు ఒకరోజు ఒక వైపు, మరో రోజు మరో వైపు కట్టు కట్టుకుని కనిపించాడు. 2019–24 మధ్య గొడ్డలి పార్టీ హయాంలో కల్తీ మద్యం కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇలాంటి పార్టీపట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. 'అదే సమయంలో జరిగిన లిక్కర్ స్కామ్‌పై ప్రస్తుతం ఈడీ విచారణ కొనసాగుతోంది. పూర్తి ఆధారాలతో గొడ్డలి పార్టీ మాజీ మంత్రిని ఈడీ అరెస్ట్ చేస్తే.. దానిపై కూడా మనల్ని తప్పుబడుతున్నారు. ఈడీ కేంద్ర దర్యాప్తు సంస్థ.. మనం చెబితే అరెస్టు చేసే జేబు సంస్థ కాదు. గొడ్డలి పార్టీ నుంచి భవిష్యత్‌లో ఇంకా ఎన్ని డ్రామాలు చూడాల్సి వస్తుందో!' అని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. 'జగన్ ప్రెస్‌మీట్ పెడితే మనందరికీ పండగే. చంద్రబాబు ప్రెస్‌మీట్‌లో ఆయన చెప్పే విషయం ఏమీ తెలియని వారికి కూడా సులభంగా అర్థమయ్యేలా ఉంటుంది. కానీ మాజీ సీఎం జగన్‌కు డీఎస్సీ, ఏపీపీఎస్సీకి తేడా తెలియదు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ రెండూ ఒకటేనంటారు. జగన్ రెడ్డికి మరోసారి సవాల్ చేస్తున్నా. టైమ్, డేట్, లొకేషన్ నువ్వే ఫిక్స్ చేయి.. డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం. అసెంబ్లీలోనూ ఎన్ని రోజులైనా చర్చించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం అన్నారు. 'నా సవాల్‌ను స్వీకరించి ఎందుకు రావడం లేదు? ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించకుండా, ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదనే వాస్తవం బయటపడుతుందనే భయమా? ప్రెస్‌మీట్లు ఎందుకు.. అసెంబ్లీకి రా! పులివెందుల ప్రజలు నిన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వారి సమస్యలను అసెంబ్లీలో ఎందుకు ప్రస్తావించడం లేదు? రెండేళ్లలో జగన్ అసెంబ్లీకి వచ్చింది ఒక్కసారి మాత్రమే. అది కూడా ప్రమాణస్వీకారానికి వచ్చి వెళ్లిపోయారు. జగన్‌లా నేను కంచుకోటలో గెలిచిన వ్యక్తిని కాదు'.

'1988 తర్వాత టీడీపీ ఎప్పుడూ గెలవని మంగళగిరిలో తొలిసారి ఓడినా వెనక్కి తగ్గకుండా పోరాడి విజయం సాధించాను. కుప్పంలో పోటీ చేయమని చెప్పినా మంగళగిరిలోనే నిలబడి 91 వేల మెజార్టీతో గెలిచి ఆ విజయాన్ని చంద్రబాబుకి గిఫ్ట్‌గా ఇచ్చాను. మంగళగిరి ప్రజల రుణం తీర్చుకుంటున్నాను. నీకు కూడా చిత్తశుద్ధి ఉంటే.. పులివెందుల ప్రజల కోసమైనా అసెంబ్లీకి రా..!' అని వైఎస్ జగన్‌కు లోకేష్ సవాల్ విసిరారు. కూటమి ఐక్యతను కాపాడండి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే మన లక్ష్యం కావాలన్నారు.

'కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి కూటమిలో విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. జనసేన, బీజేపీ పేరుతో టీడీపీని తిడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా ఉండాలి. వాళ్ల ప్రచారాన్ని నమ్మి ఆవేశపడకుండా కూటమి ఐక్యతను కాపాడాలి'.

'మనమంతా ఐక్యంగా ఉండి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుంది. ఈ విషయాన్ని ప్రజలకు వివరించి కూటమి బలాన్ని మరింత పెంచాలి' అని కార్యకర్తలకు లోకేష్ పిలుపునిచ్చారు. 'మీ అభిమానానికి నేను ధన్యుడిని. యువగళం పాదయాత్రలో కణెళికల్‌కు రాలేకపోయిన లోటు నేడు తీరిపోయింది. మీరు ఇచ్చిన ఘన స్వాగతం, చూపించిన ప్రేమ, అభిమానం ఎప్పటికీ మరిచిపోలేను. పట్టణ అధ్యక్షుడి ఆత్మీయ పలకరింపు నా గుండెను హత్తుకుంది. వీలైతే మీ ఇంటికి భోజనానికి వస్తాను. గతంలో కణెళికల్‌కు సీఎం చంద్రబాబు వచ్చినప్పుడు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పూర్తిస్థాయిలో జరగడం లేదు. కానీ కణెళికల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేసే బాధ్యత నాది. నిధులు సమకూర్చే బాధ్యత మంత్రి కేశవ్‌దని అన్నారు. 'రెండు సంవత్సరాల్లో అడ్మిషన్లు పూర్తిస్థాయికి తీసుకెళ్లే బాధ్యత స్థానిక ఎమ్మెల్యేది' అని నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జి. లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, జోనల్ కోఆర్డినేటర్ రె÷–డడెప్పగారి శ్రీనివాస రెడ్డి, అనంతపురం పార్లమెంట్ ప్రెసిడెంట్ పూల నాగరాజు, అనంతపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి జి. శ్రీధర్ చౌదరి, నియోజకవర్గ పరిశీలకులు బి. గురప్పతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల అడుగులు



ఇప్పటివరకు 420 ఎకరాల్లో రైతులు వరి సాగు నుంచి ఆయిల్ పామ్ సాగులోకి మారారు.

**1250 ఎకరాల్లో కూరగాయల సాగు..**

ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతుల అడుగులు వేస్తున్నారు. దీర్ఘకాలికంగా ఆదాయం ఇచ్చే ఆయిల్ పామ్, అలాగే కూరగాయలు, పూల తోటల సాగు చేస్తున్నారు. కాలానికి అనుగుణంగా పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక దృష్టి.. పక్కా కార్యాచరణ సత్ఫలితాలు ఇస్తున్నాయి. ప్రతి వారం జిల్లా కలెక్టర్ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తున్న రైతులను నేరుగా కలిసి సాగు విధానాలు, పంట దిగుబడి, ఆదాయం తదితర వివరాలు సేకరిస్తూ.. ప్రభుత్వ సబ్సిడీలు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. వారికి అభినందనలు తెలియజేస్తున్నారు.

**విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు..**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రణాళిక ప్రకారం జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో రైతు వేదికలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో, క్షేత్రస్థాయి ప్రదర్శనలు నిర్వహించారు. ఆయిల్ పామ్, కూరగాయలు, పూల మొక్కల సాగుతో లాభాలను వివరిస్తూ జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు, యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ.. కరపత్రాలు రైతులకు పంచి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు ఉద్యానవన, వ్యవసాయ శాఖ, సహకార శాఖ అధికారులతో నిర్వహించారు. దీంతో జిల్లావ్యాప్తంగా ఎల్ నినో ప్రభావం, ఇబ్బందులు అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి ఆదాయం పొందాలనే ఉద్దేశం జిల్లాలోని రైతులు దాదాపు 1250 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు, 35 ఎకరాల్లో వివిధ రకాల పూల మొక్కలు సాగు చేస్తున్నారు. ఆయా పంటల సాగుతో రైతులకు నిరంతర ఆదాయం సమకూరుతున్నది.

సంప్రదాయ వరిసాగుకు స్వస్తి పలికి 25 నుంచి ముప్పై ఏండ్ల పాటు ఆదాయం ఇచ్చే ఆయిల్ పామ్ తోటల సాగు వైపు రైతులు మారారు. ఈ సీజన్లో జిల్లాలో ఇప్పటివరకు 162 మంది రైతులు 420 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేశారు. మొదటి మూడు ఏండ్లపాటు అంతర పంటలు సాగు చేసి ఆదాయం పొందవచ్చు. ప్రస్తుతం ఆయిల్ పామ్ ఒక టన్నుకు రూ. 23 వేలపైగా ధర ఉంది. జిల్లాలో సంప్రదాయ వరి సాగుకు స్వస్తి పలుకుతూ.. మిగితా పంటలు సాగు చేస్తున్న ఆదర్శ రైతులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రతి మంగళవారం క్షేత్రస్థాయిలో కలిసి .. సాగు విధానాలు, దిగుబడి, లాభాలు తదితర అంశాలు తెలుసుకొని.. అభినందిస్తున్నారు.

**రెండు ఎకరాల్లో బంతి పూల సాగు ..**

గంభీరావుపేట మండలం గజ సింగవరంలో రైతు బోయిని మల్లేశం తనకు ఉన్న మూడున్నర ఎకరాల నుంచి రెండు ఎకరాలలో జూలైలో బంతి పూల సాగు చేపట్టారు. ఈ పంట నాటిన 60-65 రోజుల నుంచి సెప్టెంబర్ నుండి ప్రారంభమై డిసెంబర్ వరకు కొనసాగుతుంది. ప్రతి 2-3 రోజుల వ్యవధిలో పూల కోత చేయవచ్చు, ఇది 60-75 రోజుల పాటు కొనసాగుతుంది. ఎకరానికి సుమారు 45-50 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. రెండు ఎకరాల సాగుకు గాను రైతు రూ. 50 వేల నుంచి రూ. 60వేల వరకు ఖర్చు చేశారు. ఇందులో ఉద్యాన శాఖ ద్వారా విత్తనాలు, ఎరువులకు కలిపి 50 శాతం రాయితీ లేదా ఎకరానికి రూ. 8వేల చొప్పున గరిష్టంగా ఐదు ఎకరాల వరకు రాయితీ అందనుంది. రైతుకు సగటున ఒక్కో కిలో బంతి పూలకు రూ 60 ధర లభిస్తుంది. దసరా, దీపావళి, శుభకార్యాలు, అయ్యప్ప పూజా కార్యక్రమాలతో ఇంకా ఎక్కువ ఆదాయం వచ్చే ఉంది.

**జిల్లా కలెక్టర్ అభినందన..**

గజ సింగవరంలో రైతు బోయిని మల్లేశం వరి సాగును వదిలి బంతి పూల సాగు చేస్తుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు. ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు? పంట ఎన్ని రోజుల్లో చేతికి వస్తుంది? ఎంత ఆదాయం వస్తుంది? అనే వివరాలను రైతు మల్లేశంను అడిగి తెలుసుకున్నారు. అతడిని శాలువాతో సన్మానించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వరి పంటకు ప్రత్యామ్నాయంగా బంతి పూల సాగు చేయడం అభినందనీయమని కొనియాడారు. మిగితా రైతులు ఆదర్శంగా తీసుకొని తమకు ఉన్న భూమిలో ఆరుతడి పంటలు, కూరగాయలు సాగు చేసి ఆదాయం పొందాలని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పిలుపు నిచ్చారు. ఉద్యానవన శాఖ, ఇతర శాఖల నుంచి వచ్చే ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. పరిశీలనలో సర్పంచ్ ఉమ్మారెడ్డి విమల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, ఎంపీడీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా పాఠశాలను జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలి

**-విద్యార్థులకు ఇబ్బందులను కలిగించవద్దు**
**-టిఎన్ఎస్ఎఫ్,టిజెఎస్,టి ఎన్విఎస్**



కామారెడ్డి నియోజకవర్గానికి కేటాయించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మరియు ఏటిసి (అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్స్ ను) కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములలో ఏర్పాటు చేయాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు,టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కంబాల లక్ష్మణ్ యాదవ్,విద్యార్థి జిల్లా అధ్యక్షుడు వినయ్ లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాలు టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బాలు, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్ యాదవ్ లు మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మరియు ఏటీసీ విద్య సంస్థలను కామారెడ్డి డిగ్రీ కళాశాల భూములలో ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని,రవాణా సదుపాయాలు,మౌలిక వసతులు లేని చోట వీటిని ఏర్పాటు చేస్తే వాటి లక్ష్యం దెబ్బతింటుందని ప్రభుత్వం దీన్ని దృష్టిలో పెట్టుకొని కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో విద్యాసంస్థలు ఏర్పాటు చేయడానికి డిగ్రీ కళాశాల భూములు రిజిస్ట్రేషన్ కాలేదని ఇప్పుడు కళాశాల పేరు మీద భూములు ఉన్నప్పటికీ దూర ప్రాంతాల్లో ఈ విద్యాసంస్థలు ఏర్పాటు చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రైతులు విద్య సంస్థలు ఏర్పాటు కావాలని ఇచ్చిన భూములను నిరుపయోగంగా ఉంచి విద్యార్థులకు నష్టం చేస్తున్నారని అన్నారు. విద్యాసంస్థలు జిల్లా కేంద్రానికి వచ్చేంతవరకు పోరాటం చేస్తామని దానికి అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు సహకరించాలని లేకపోతే నిరవధిక దీక్షలను చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు వినయ్ రాజు సందీప్ సతీష్ మధు రాహుల్ నవనీత్ లు పాల్గొన్నారు.

# టెక్రియాల్ చెరువు కాలుష్యంతో రైతులు, పశువులకు తీవ్ర ఇబ్బందులు

**-వినాయక విగ్రహాల నిమజ్జనంతో నీరు కలుషితం**
**-పంటలపై ప్రభావం**
**-చెరువు నీటిపై ఆధారపడుతున్న రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్కు విజ్ఞప్తి**



కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టెక్రియాల్ గ్రామంలో సుమారు 560ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు కాలుష్యంతో రైతులు, పశువుల పెంపకందారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ఈ చెరువు నీటిని గ్రామ ప్రజలు తాగునీటి అవసరాలకు సైతం వినియోగించుకునేవారని, ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని వారు చెబుతున్నారు. దాదాపు పది నుంచి పదిహేనేళ్ల క్రితం వరకు చెరువు నీటిని ప్రజలు వినియోగించుకునే స్థాయిలో ఉండేదని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే కాలక్రమేణా చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనాలు పెద్దఎత్తున నిర్వహించడం, విగ్రహాల తయారీలో ఉపయోగించే రంగులు, రసాయనాలు నీటిలో కలవడం తదితర కారణాలతో చెరువు నీరు తీవ్రంగా కలుషితమైందని వారు తాగక రైతులకు నష్టం చెరువు నీరు కలుషితం కావడంతో ప్రస్తుతం పశు వులు సైతం ఆ నీటిని తాగేందుకు నిరాకరిస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. కలుషిత నీటిని తాగిన పశువులు అనారోగ్యానికి గురికావడంతో పాటు, కొన్ని సందర్భాల్లో పశువులు మృతి చెందిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా చెరువు నీటిని సాగునీటి అవసరాలకు వినియోగిస్తున్న రైతులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. కలుషిత నీటిని పొలాలకు వినియోగించడం వల్ల పంటలపై ప్రతికూల ప్రభావం పడుతోందని, పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గుతున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో చెరువుపై ఆధారపడి జీవిస్తున్న అనేక మంది రైతులు ఆర్థికంగా నష్టపోతున్న పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి టెక్రియాల్ చెరువు నీటి నాణ్యతపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలన చేపట్టి, నీటి నమూనాలను పరీక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెరువు కాలుష్యానికి గల కారణాలను గుర్తించి, నీటిని శుద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే భవిష్యత్తులో చెరువు నీరు మరింత కలుషితం కాకుండా వినాయక విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చెరువు నీటిపై ఆధారపడుతున్న రైతులు, పశువుల పెంపకందారుల సమస్యలను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించి, వారికి న్యాయం చేయాలని టెక్రియాల్ గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు. చెరువు నీటి కాలుష్యంపై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించి, వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకువచ్చి, రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# బీసీ రిజర్వేషన్ ల పితామహుడు బీపీ మండల్ 109వ జయంతి

**-బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మండల్ చిత్రపటానికి పూలమాలలతో ఘనమైన నివాళులు....బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్**




కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణనకు సంబందించి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసి నటువంటి గెజిట్ లో ఓబీసీల కు సంబంధించిన కాలం లేకపోవడం చాలా అన్యాయం సిగ్గుచేటు దుర్మార్గం ఓబీసీ రిజర్వేషన్ ల సాధన కోసం బీపీ మండల్ చేసిన కృషి ఎంతో విలువైనదని మండల్ కమిషన్ సిపారసులన్నింటిని వెంటనే అమలు చేయాలి. బీపీ మండల్ జయంతి సందర్బంగా ఆయన ఆశయ సాధన కొరకు ముఖ్యంగా యువకులు ప్రతి ఒక్కరునడుం బిగించి పాటు పడాలన్నారు. బీసీలను పట్టి పీడిస్తున్న పేదరికం వెనుకబాటు తనం నుంచి వారిని బయటపడేసే ప్రయత్నంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ చేసిన కృషి మరువలేనిదని దేశంలో 60 శాతం పైగా జనాభా కలిగిన ఓబీసీలకు విద్య ఉద్యోగ తదితర రంగాల్లో రిజర్వేషన్ల కోసం బీపీ మండల్ చేసిన కృషి ఆనిర్వచనం మైనదని బీసీల ఆరాధ్యులు బీసీ రిజర్వేషన్ల పితామహుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బీపీ మండల్ బందేశ్వరి ప్రసాద్ మండల్ 109 వ జయంతిని స్థానిక మిర్యాలగూడ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా మండల్ చిత్రపటానికి పూలమాలలతో నివాళు లర్పించడం జరిగిందన్నారు. అనంతరం బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ మాట్లాడుతూ బీహార్ లోని సామాన్య యాదవ్ కుటుంబంలో జన్మించి పూలే అంబేద్కర్ వారసత్వానికి పుచ్చుకొని ఎమ్మెల్సీగా ఎంపీగా ఎన్నిక కావడమే కాకుండా బీహార్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సేవలందించారు జనతా ప్రభుత్వం లో మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఆర్టికల్ 340 ప్రకారం విద్యా ఉద్యోగ రంగాల్లో ఓబీసీలకు 27% రిజర్వేషన్ల కల్పన కోసం బీపీ మండల్ అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేసి బీసీ రిజర్వేషన్ల సాధన కోసం కృషి చేశారు స్వాతంత్రం వచ్చిన 45సంవత్సరాల తర్వాత ఓబీసీలకు రిజర్వేషన్లు సాధించిన ఘనత బీపీ మండల్ దక్కుతుందన్నారు బీసీలను పట్టిపీడిస్తున్న పేదరికం వెనుక బాటు తనం నుంచి వారిని బయటపడేసి ప్రయత్నం లో ల బీహార్ మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ చేసిన కృషి మరువలేనిది అని బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ కొనియాడారు బీపీ మండల్ వెనుకబడిన తరగతుల కమిషన్ కు అధ్యక్షతన వహించారు ఇది 1980లో తన నివేదికను సమర్పించిందిఈ కమిషన్ సిపారసుల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు మరియు విద్య సంస్థలలో వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు మనకు గారికి ఇచ్చాయి మండల్ సామాజిక న్యాయం అణగారిన వర్గాల హక్కుల కోసం ముఖ్యంగా ఓబీసీల కోసం గట్టిగా వాదించారని అని అన్నారు ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తునటువంటి జనగణనలో కులగణనకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినటువంటి గెజిట్ నోటిఫికెషన్లో ఓబీసీల కు సంబంధించిన కాలం లేకపోవడం చాలా సిగ్గు చెటన్నారు జనగణన లెక్కింపు కార్యక్రమంలో 28అంశాలతో కూడిన విడుదల చేసి దానిలో కూడా ఓబీసీల కాలం ఉంచలేదు 12వ కాలంలో ఎస్సీ ఎస్టీ అండ్ అదర్స్ అని పెట్టడం జరిగి ందని కానీ క్యాస్ట్ ఓపెన్ గా పెట్టకపోవడంతో ఓబీసీ అని లేకపోవడం వల్ల ఓబీసీ లో ఉన్నటువంటి కులాలను లెక్కించడం కష్టంగా మారుతుందని అని అన్నారు. కేంద్ర ప్రభుత్వమే

రాష్ట్రాలను యూనిట్లగా తీసుకొని ప్రతి రాష్ట్రంలో ఉన్నటువంటి ఓబిసి కులాలను లెక్కచేస్తే దేశవ్యాప్తంగా లెక్కలు చేయడానికి సులువుగా ఉంటుందని భావించారు ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇలా బీసీల లెక్కలను తీయకపోతే రానున్న రోజుల్లో జెన్ జి ఉద్యమ తరహాలో ఉద్యమించి బీసీల హక్కుల కోసం పోరాడుతామని హెచ్చరించారు అని అన్నారు. ఇప్పటికైనా బీసీలందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు బిపి మండల్ బిందెశ్వరి ప్రసాద్ మండలం 109 వ జయంతి సందర్భంగా మండల్ ఆశయ సాధన కొరకు ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువకులు నడుం బిగించి కలిసికట్టుగా కృషి పాటుపడాలన్నారు ఈ కార్యక్రమంలో!! బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రబెల్లి దుర్గయ్య రజక, రేవంతు మహేష్, సంతోష్, నరేష్, చింటూ, అభిలాష్,సమీర్, సాత్విక్, అక్షయ, వైష్ణవి, నికిత, కార్తీ క్,రామ్, చరణ్, లలిత, గౌతమి, నందిని, సరస్వతి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com